జిల్లా ఇన్‌చార్జి మంత్రిగా కొల్లు రవీంద్ర



అనకాపల్లి, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): జిల్లా ఇన్‌చార్జి మంత్రిగా గనులు, భూగర్భ, ఎక్సైజ్ శాఖల మంత్రి కొల్లు రవీంద్ర నియమితులయ్యారు. ఈ మేరకు ప్రభుత్వం మంగళవారం ఉత్తర్వులు జారీ చేసింది. జిల్లాలో వివిధ ప్రభుత్వ శాఖల ఆధ్వర్యంలో జరిగే అభివృద్ధి పనులపై ఆయన సమీక్షా సమావేశాలు నిర్వహించి, అధికారులకు దిశానిర్దేశం చేస్తారు. రవీంద్ర కృష్ణా జిల్లా మచిలీపట్నం నుంచి ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. గత టీడీపీ ప్రభుత్వంలో కూడా ఆయన మంత్రిగా పనిచేశారు.

నేటి నుంచి ప్రైవేటు మద్యం



జిల్లాలో 136 దుకాణాల ఏర్పాటుకు అధికారులు అనుమతి

- లైసెన్స్ ఫీజులో తొలి కిస్తీ చెల్లించిన వ్యాపారులు
- ఉదయం పది గంటల నుంచి రాత్రి పది గంటల వరకు అమ్మకాలు



తుమ్మపాలలో మూతపడనున్న ప్రభుత్వ మద్యం షాపు

అనకాపల్లి, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి):

జిల్లాలో బుధవారం నుంచి ప్రైవేటు మద్యం విక్రయాలు ప్రారంభం కానున్నాయి. దీంతో గత వైసీపీ ప్రభుత్వం ఏర్పాటు చేసిన మద్యం షాపులు మంగళవారం రాత్రితో మూతపడనున్నాయి. జీవీఎంసీ పరిధిలోని అనకాపల్లి జోన్ మినహాయించి ప్రొహిబిషన్, ఎక్సైజ్ శాఖ అనకాపల్లి జిల్లాలో 136 ప్రైవేటు దుకాణాల్లో బుధవారం ఉదయం నుంచి మద్యం అమ్మకాలు జరగనున్నాయి.

గత వైసీపీ ప్రభుత్వం మద్యం అమ్మకాలను స్వయంగాచేపట్టడమే కాకుండా నాసిరకం మద్యాన్ని అధిక ధరలకు విక్రయించిన సంగతి తెలిసిందే. దీనిపై మద్యం ప్రియుల్లో తీవ్ర అసంతృప్తి వ్యక్తమైంది. తాము అధికారంలోకి వస్తే మద్యం ధరలను తగ్గించడంతోపాటు ప్రైవేటు దుకాణాలకు అనుమతి ఇస్తామని కూటమి పార్టీలు హామీ ఇచ్చాయి. దీంతో కూటమి ప్రభుత్వం ఏర్పడిన తరువాత నూతన మద్యం పాలసీని అమల్లోకి తీసుకువచ్చింది. ప్రైవేటు మద్యం దుకాణాల ఏర్పాటుకు ఇటీవల నోటిఫికేషన్ జారీ చేయగా, జిల్లాలో 136 మద్యం షాపుల కోసం 3,291 మంది దరఖాస్తు చేసుకున్నారు. సోమవారం లాటరీ విధానంలో ప్రైవేటు వ్యక్తులకు మద్యం షాపులను అధికారులు కేటాయించారు. దుకాణాలను దక్కించుకువారు మంగళవారం సాయంత్రంలోగా లైసెన్సు ఫీజులో ఆరో వంతును బ్యాంకుల్లో చెల్లించారు. ఈ మేరకు రూ.14.46 కోట్లు డిపాజిట్టు అయినట్టు జిల్లా ప్రొహిబిషన్, ఎక్సైజ్ శాఖ అధికారి సుధీర్ తెలిపారు. కొత్తగా షాపులు ప్రారంభించే వ్యాపారులు తమ జిల్లా కార్యాలయంలో నగదు చెల్లించి మద్యం స్టాక్ పొందాలని ఆయన తెలిపారు. ఉదయం పది గంటల నుంచి రాత్రి పది గంటల వరకు మద్యం విక్రయించుకోవచ్చని పేర్కొన్నారు. మద్యం దుకాణాలను ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఏర్పాటు చేశారా? లేదా?అన్నది వారం రోజుల్లో పరిశీలించి, పూర్తికాల అనుమతులు జారీ చేస్తామని ఆయన స్పష్టం చేశారు.

రైతు బజార్లకు కదలిక

ప్రతి అసెంబ్లీ సెగ్మెంట్‌లో ఏర్పాటుకు కూటమి ప్రభుత్వం చర్యలు

- తొలుత అనకాపల్లి, ఎలమంచిలి, నర్సీపట్నంలో రైతుబజార్లు
- వినియోగదారులు, రైతులు హర్షం



రైతులు రాని నర్సీపట్నం రైతు బజార్

(అనకాపల్లి-ఆంధ్రజ్యోతి)

అనకాపల్లి జిల్లాలోని పట్టణ ప్రాంతాల్లో రైతుబజార్లు ఏర్పాటు కలగానే మిగిలింది. గత వైసీపీ ప్రభుత్వం ఒక్కచోట కూడా రైతుబజార్‌ను ఏర్పాటు చేయలేదు. పైగా గత టీడీపీ హయాంలో ఏర్పాటైన ఎలమంచిలి, నర్సీపట్నం రైతుబజార్లను నిర్వీర్యం చేసింది. ఈ నేపథ్యంలో గత ఎన్నికల ముందు ఇచ్చిన హామీ మేరకు ప్రతి అసెంబ్లీ నియోజకవర్గంలో ఒక రైతుబజార్ ఏర్పాటుకు కూటమి ప్రభుత్వం చర్యలు ప్రారంభించింది. దీంతో రైతులు, వినియోగదారులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

జిల్లాలో అనకాపల్లి, నర్సీపట్నం, ఎలమంచిలి, చోడవరంలో రైతు బజార్లను ఏర్పాటు చేయాలన్న ప్రతిపాదన ఎప్పటి నుంచో వుంది. అనకాపల్లిలో సరైన స్థలం అందుబాటులో లేకపోవడంతో రైతుబజార్ ఏర్పాటు కాలేదు. ఎలమంచిలి ఎంపీడీఓ కార్యాలయం ప్రాంగణంలో మినీ రైతు బజార్ ఏర్పాటు చేశారు. అయితే వాస్తవ రైతులకు గుర్తింపు కార్డులు జారీ చేయకపోవడంతో కూరగాయ రైతులు రావడం మానేశారు. సుమారు ఏడాదిన్నర తరువాత మూతపడింది. కాగా టీడీపీ అధికారంలోకి వచ్చిన తరువాత 2014-19 మధ్య కాలంలో అనకాపల్లి, నర్సీపట్నం, ఎలమంచిలిలో రైతుబజార్ల ఏర్పాటుకు మార్కెటింగ్ శాఖ అధికారులు మరోసారి ప్రతిపాదనలు రూపొందించారు. ప్రభుత్వం ఆమోద ముద్ర వేయడంతో అనకాపల్లిలో డీసీఎంఎస్ స్థలంలో రైతు బజార్ ఏర్పాటుకు అధికారులు స్థల పరిశీలన చేశారు. అయితే డీసీఎంఎస్ అభ్యంతరం తెలపడంతో రైతు బజార్ ఏర్పాటు కాలేదు. నర్సీపట్నంఇందిరా మార్కెట్ యార్డులో 2017లో రైతు బజార్ ఏర్పాటు చేశారు. వైసీపీ హయాంలో కరోనా వైరస్ ప్రబలినప్పుడు కూరగాయల మార్కెట్‌ను డిగ్రీ కాలేజీ మైదానంలోకి మార్చారు. కరోనా వైరస్ తగ్గిపోయి మూడేళ్లు అవుతున్నప్పటికీ కూరగాయల దుకాణాలను పూర్తిస్థాయిలో ఇందిరా మార్కెట్‌కు తరలించలేదు. ఎలమంచిలిలో స్థలం అందుబాటులో వున్నప్పటికీ వైసీపీ పాలకులు రైతుబజార్ ఏర్పాటుకు ఎటువంటి చర్యలు చేపట్టలేదు.



ఎలమంచిలిలో రైతు బజార్ దుస్థితి



అనకాపల్లిలో కూరగాయలు విక్రయించే గాంధీ మార్కెట్

నష్టపోతున్న రైతులు, వినియోగదారులు

గత వైసీపీ ప్రభుత్వం రైతుబజార్ వ్యవస్థను నీరుగార్చింది. ఐదేళ్లలో ఒక్క రైతు బజార్‌ను కూడా ప్రారంభించలేదు. ఎలమంచిలి, నర్సీపట్నంలో రైతుబజార్ల నిర్వహణను గాలికొదిలేసింది. దళారీల ప్రమేయం లేకుండా నేరుగా వినియోగదారులకు కూరగాయలు అమ్ముకునేందుకు రైతు బజార్ల ఏర్పాటులో తీవ్ర నిర్లక్ష్యాన్ని ప్రదర్శించింది. దీంతో రైతులు కూరగాయలు, ఆకుకూరలు, ఇతర వ్యవసాయ ఉత్పత్తులను విశాఖపట్నం తీసుకెళ్లి అమ్ముకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. వైసీపీ ప్రభుత్వ నిర్వాకంతో ఇటు కూరగాయ రైతులు, అటు వినియోగదారులు తీవ్రంగా నష్టపోతున్నారు. పండించిన కూరగాయలను దళారులు అడిగి ధరలకు విక్రయించుకోవాల్సి వస్తున్నది. వినియోగదారులు సైతం ప్రైవేటు దుకాణాల్లో ఎక్కువ ధరలకు కూరగాయలు కొనుగోలు చేసుకుంటున్నారు. ఈ నేపథ్యంలో ఇటీవల జరిగిన సాధారణ ఎన్నికల్లో వైసీపీ అధికారాన్ని కోల్పోయి, కూటమి పార్టీలు అధికారంలోకి వచ్చాయి. ఎన్నికల మందు ఇచ్చిన హామీ మేరకు జిల్లాలో ప్రతి అసెంబ్లీ నియోజకవర్గ కేంద్రంలో ఒక రైతు బజార్ ఏర్పాటుకు చర్యలు చేపట్టింది. మండలాల్లో వినియోగదారుల కోసం మొబైల్ రైతు బజార్ల ఏర్పాటు కోసం ప్రతిపాదనలు రూపొందిచాలని జిల్లా అధికారులను ఆదేశించింది. దీంతో అనకాపల్లి, నర్సీపట్నం, ఎలమంచిలిలో రైతు బజార్లను ఏర్పాటు చేయడానికి అధికారులు చర్యలు చేపట్టారు.

నేటి నుంచి రెవెన్యూ గ్రామసభలు

భూముల రీసర్వే పూర్తయిన గ్రామాల్లో నిర్వహణ

- ప్రజల నుంచి అర్జీలు, ఫిర్యాదులు స్వీకరణ
- తహసీల్దార్లకు కలెక్టర్ విజయకృష్ణన్ ఆదేశం



వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న కలెక్టర్ విజయకృష్ణన్

అనకాపల్లి కలెక్టరేట్, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): భూముల రీసర్వే పూర్తయిన 455 గ్రామాల్లో బుధవారం నుంచి గ్రామసభలు నిర్వహించాలని కలెక్టర్ విజయకృష్ణన్ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్ సమావేశమందిరం నుంచి మంగళవారం తహసీల్దార్లతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో రెవెన్యూ గ్రామసభల నిర్వహణపై ఆమె మాట్లాడారు. 30 రోజుల్లో గ్రామ సభలు పూర్తయ్యేలా షెడ్యూల్ తయారు చేసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా భూములకు సంబంధించి ప్రజల నుంచి అన్ని రకాల అర్జీలు, ఫిర్యాదులు, వినతులను తప్పనిసరిగా స్వీకరించాలని స్పష్టం చేశారు. రీసర్వే కారణంగా తాము నష్టపోయినట్టు రైతులు ఎవరైనా ఫిర్యాదు చేస్తే.. క్షేత్రస్థాయిలో పరిశీలించి సమస్యను పరిష్కరించాలని చెప్పారు. రీసర్వేలో జరిగిన పొరపాట్లను రెవెన్యూ గ్రామ సభల్లో సరిదిద్దాలన్నారు. గ్రామసభల నిర్వహణపై ముందస్తుగా ప్రచారం చేయాలని, ప్రతి గ్రామ సభకు తహసీల్దార్, మండల సర్వేయర్, గ్రామస్థాయి సిబ్బంది తప్పనిసరిగా హాజరుకావాలని కలెక్టర్ స్పష్టం చేశారు. వీడియో కాన్ఫరెన్స్‌లో డీఆర్‌ఓ దయానిధి పాల్గొన్నారు.

రోడ్డు విస్తరణపై మహా నిర్లక్ష్యం

నిర్వాసితుల్లో పలువురికి టీడీఆర్‌లు జారీ చేయని అధికారులు

- ఆగిన పెరుగుబజార్- గాంధీబొమ్మ జంక్షన్ రోడ్డు అభివృద్ధి పనులు
- గోతులు, ఇరుకు రోడ్డుతో రాకపోకలకు ప్రజల ఇక్కట్లు



పెరుగుబజారు జంక్షన్‌లో వర్షం నీరు చేరిన భారీ గొయ్యి

అనకాపల్లి టౌన్, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి):

పట్టణంలో అత్యంత రద్దీగా వుండే పెరుగుబజారు జంక్షన్ నుంచి గాంధీబొమ్మ జంక్షన్ వరకు రైల్వే స్టేషన్‌కు వెళ్లే రోడ్డు విస్తరణ అసంపూర్తిగా నిలిచిపోయింది. రహదారిని విస్తరిస్తారన్న ఉద్దేశంతో గతంలో రోడ్డుపై ఏర్పడిన గోతులను జీవీఎంసీ అధికారులు పూడ్చలేదు. రోడ్డు విస్తరణ పనులు ఆగిపోవడం, వర్షాలతో గోతుల్లో నీరు చేరడంతో రాకపోకలకు ప్రజలు ఇబ్బంది పడుతున్నారు.

అనకాపల్లి మెయిన్ రోడ్డులో పెరుగుబజారు జంక్షన్ నుంచి గాంధీ బొమ్మ జంక్షన్ వరకు పలు వ్యాపార సంస్థలు, సినిమా థియేటర్, విద్యా సంస్థలు ఉన్నాయి. మధ్యలో పప్పులవీధి జంక్షన్‌లో కిరాణా, మెడికల్, వస్త్ర దుకాణాలు ఉన్నాయి. వీటికి వచ్చే వారితోపాటు గవరపాలెం వాసు



విస్తరణకు నోచుకోని రహదారి

లు, పరవాడ మార్గం నుంచి వచ్చేవారు రైల్వేస్టేషన్‌కు, లక్ష్మీదేవిపేట, తుమ్మపాల ప్రాంతాలకు ఈ రోడ్డు మీదుగా వెళుతుంటారు. 20 నుంచి 30 అడుగుల వెడల్పు మాత్రమే వున్న ఈ రహదారి వాహనాల రాకపోకలు, పాదచారులతో నిత్యం రద్దీగా వుంటుంది. పెరుగుబజారు జంక్షన్ నుంచి గాంధీబొమ్మ జంక్షన్ వరకు ... మిగతా 8వ పేజీలో



రైల్వే అండర్‌బ్రిడ్జి కింద నిలిచిపోయిన ఆర్టీసీ బస్సు

అనకాపల్లిలో భారీ వర్షం

- విజయరామరాజుపేట అండర్‌బ్రిడ్జి కింద నిలిచిపోయిన ఆర్టీసీ బస్సు
- ఎలమంచిలిలో పిడుగులు
- పలు ఇళ్లల్లో కాలిపోయిన ఎలక్ట్రానిక్ వస్తువులు

అనకాపల్లి టౌన్, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి) : అనకాపల్లి పట్టణంలో మంగళవారం వేకువజామున భారీ వర్షం కురిసింది. దీంతో లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. పీటీడీ కాంప్లెక్స్‌లో వర్షపునీరు నిలిచిపోవడంతో ప్రయాణికులు ఇబ్బంది పడ్డారు. విజయరామరాజుపేట రైల్వే అండర్‌బ్రిడ్జి కింద వర్షం నీరు నిలిచిపోయి ఆర్టీసీ బస్సు చిక్కుకుపోయింది. ఉదయం ఏడు గంటల సమయంలో అనకాపల్లి డిపో నుంచి మాడుగుల మండలం జాలంపల్లి వెళ్లే బస్సును అండర్‌బ్రిడ్జి వద్ద నీటిలో నుంచి దాటించేందుకు డ్రైవర్ ప్రయత్నించారు. అయితే ఇంజన్‌లోకి నీరు వెళ్లడంతో బస్సు మొరాయించింది. బస్సులో ఉన్న సుమారు 30 మంది ప్రయాణికులను బ్రిడ్జి కింద గట్టు మీదకు చేర్చి, మరొక బస్సులో ఎక్కించి పంపారు. కాగా రైల్వే అండర్‌బ్రిడ్జి కింద నీరు నిలిచిపోవడంతో వాహనాలను నాయుళ్లవీధి, లక్ష్మీదేవిపేట రైల్వేగేటు ... మిగతా 8వ పేజీలో

గబ్బాడ ఇసుకకు లైన్ క్లియర్

- భవన నిర్మాణదారులకు అందుబాటులోకి తీసుకురావాలి
- అధికారులకు స్పీకర్ అయ్యన్నపాత్రుడు ఆదేశం



గబ్బాడ డిపోలో ఇసుక నిల్వలపై ఆర్డీవో వీవీ రమణను వివరాలు అడిగి తెలుసుకుంటున్న స్పీకర్ అయ్యన్నపాత్రుడు

నర్సీపట్నం, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): గబ్బాడ డిపోలోని ఇసుకను సాధ్యమైనంత త్వరగా భవన నిర్మాణదారులకు అందుబాటులోకి తీసుకు రావాలని స్పీకర్ అయ్యన్నపాత్రుడు మైనింగ్ ఏడీని ఆదేశించారు. ఆయన మంగళవారం ఇక్కడ వివిధ శాఖల అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. గబ్బాడ ఇసుకను దళారుల ప్రమేయం లేకుండా భవన నిర్మాణదారులకు మాత్రమే సరఫరా ... మిగతా 8వ పేజీలో

పారిశ్రామిక క్లస్టర్‌గా సబ్బవరం -8లో

కొరుప్రోలు గిరిజనులు వినూత్న నిరసన



రహదారి నిర్మాణం చేపట్టాలంటూ బురద రోడ్డులో కూర్చొని నిరసన తెలుపుతున్న కొరుప్రోలు గిరిజనులు

రోలుగుంట, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): గోతులతో బురదమయంగా మారి, కనీసం నడవడానికి కూడా వీలుకాని విధంగా వున్న రహదారిని అభివృద్ధి చేయాలంటూ గిరిజనులు మంగళవారం బురద రోడ్డుపై కూర్చుని వినూత్నరీతిలో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, ఎంకే పట్నం నుంచి కొరుప్రోలు వరకు సుమారు మూడు కిలో మీటర్ల మేర కనీస రహదారి సదుపాయం లేకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని వాపోయారు. పెన్షన్ కోసం డోలిమోతపై నిరసన తెలుపుతూ ఈ ఏడాది జూన్‌లో ఆందోళన చేపట్టగా, ప్రభుత్వం స్పందించి అధికారులతో సర్వే చేయించిందని, రోడ్డు నిర్మాణానికి రూ.1.5 కోట్లు మంజూరుకు ఆదేశాలు జారీ చేసిందని చెప్పారు. అయితే ప్రస్తుతం నిర్వహిస్తున్న పల్లె పండుగ- పంచాయతీ వారోత్సవాల్లో ఈ రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేయకపోవడంతో తీవ్ర నిరాశచెందామన్నారు. ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి తమ గ్రామానికి రోడ్డు నిర్మాణ పనులు మొదలు పెట్టాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

గజానికో గుంత.. ప్రయాణాలకు చింత

» అస్తవ్యస్తంగా అచ్యుతాపురం- మార్టూరు రోడ్డు » రాకపోకలకు ఇబ్బందులు పడుతున్న రెండు మండలాల ప్రజలు
» ఐదేళ్ల వైసీపీ పాలనలో పట్టించుకోకపోవడంతో మరింత దారుణం » కూటమి ప్రభుత్వమైనా స్పందించాలని వేడుకోలు


సెజ్ పునరావాస కాలనీ మార్టూరు కల్యాణ మండపం వద్ద రోడ్డు దుస్థితి


అచ్యుతాపురం అయ్యప్పగుడి దాటిన తర్వాత గుంతలు పడిన రహదారిలో వాహనదారుల పాట్లు



అచ్యుతాపురం, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి) : అచ్యుతాపురం- మార్టూరు రోడ్డు అస్తవ్యస్తంగా మారింది. గత ఐదేళ్ల వైసీపీ పాలనలో పట్టించుకునే వారు లేకపోవడంతో ఎక్కడికక్కడ గోతులు ఏర్పడ్డాయి. దీంతో రాకపోకలకు వాహనదారులతో పాటు రెండు మండలాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అచ్యుతాపురం-ఎలమంచిలి ప్రధాన రహదారిలో గల అయ్యప్ప స్వామి ఆలయం నుంచి మార్టూరు వరకు సమారు నాలుగు కిలోమీటర్ల రోడ్డును మూడు దశాబ్దాల క్రితం నిర్మించారు. ఈ రహదారిలో మార్టూరు గ్రామం ఒక్కటే ఉండడంతో ఎవరూ దీని గురించి పట్టించుకోలేదు. కాగా, మార్టూరు గ్రామానికి పక్కనే 500 ఎకరాలు సెజ్ నిర్వాసితులకు కేటాయించి సుమరు 4500 ప్లాట్లు వేశారు. నిర్వాసిత గ్రామాలను తరలించడంతో నాలుగు వేల కుటుంబాలు ఇళ్లు నిర్మించుకొని సెజ్ పునరావాస కాలనీ (దిబ్బపాలెం)లో నివాసముంటున్నారు. దీంతో అచ్యుతాపురం- మార్టూరు రహదారికి ప్రాధాన్యం ఏర్పడింది. ఈ రోడ్డు అవసరాన్ని గుర్తించిన అప్పటి టీడీపీ ప్రభుతం 2017లో రూ.కోటీ 25 లక్షలతో రోడ్డును ఐదు మీటర్లు మేరకు వెడల్పుచేసి తారు వేశారు. దీంతో సెజ్ పునరావాస కాలనీతోపాటు, సెజ్‌లో కర్మాగారాకు ఉద్యోగులను తీసుకు వెళ్లే వాహనాలు, యంత్ర సామగ్రితో వచ్చే వాహనాలు ఈ రోడ్డు గుండానే వెళ్లడం ప్రారంభించాయి. అలాగే గతంలో అచ్యుతాపురం నుంచి రాంబిల్లి వెళ్లాలంటే వెదురువాడ, వెంకటాపురం జంక్షన్ మీదుగా వెళ్లేవారు. ఈ రోడ్డు పడడంతో మార్టూరు మీదుగా రాంబిల్లి, కొత్తపట్నం, వాడనర్సాపురం, కృష్ణంపాలెం, వెల్చూరు. నాయుడుపాలెం, వై.లోవ, రాజుకోడూరు తదితర గ్రామస్థులు ఇటుగానే రాకపోకలు సాగిస్తున్నారు. ఇంతప్రాధాన్యం ఉన్న ఈ రోడ్డు గురించి గత వైసీపీ ప్రభుత్వం ఐదేళ్ల పాలనలో కనీసం పట్టించుకోలేదు. దీంతో ఎక్కడికక్కడ గుంతలు పడి రోడ్డు రూపుమారింది. అంతేకాకుండా రోడ్డుకు ఇరువైపు పులా తుప్పలు, చెట్లు భారీగా పెరిగిపోవడంతో ఎదురుగా వచ్చే వాహనాలను సైతం గుర్తించడం కష్టంగా ఉందని అంటున్నారు. ఇదిలావుంటే, ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు ఆయా గుంతల్లో నీరు చేరుతుండడంతో వాహనచోదకులు అవస్థలు వర్ణనాతీతంగా ఉన్నాయి. కనీసం కూటమి ప్రభుత్వమైనా ఈ రహదారిలో తాత్కాలిక మరమ్మతు పనులైనా చేపట్టాలని ఈ ప్రాంత ప్రజలు కోరుతున్నారు.

'అభిజిత్' మూతతో కార్మికులు ఆందోళన

» సంతకాలు చేస్తే 15 రోజుల జీతం ఇస్తామని ప్రతిపాదించిన యాజమాన్యం
» ఆ డబ్బులు ఎలా సరిపోతాయని ప్రశ్నిస్తున్న కార్మికులు
» నెలలో నాలుగు ఆదివారాలు పోను 26 రోజులు జీతం ఇవ్వాలని డిమాండ్

అచ్యుతాపురం, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): సెజ్‌లో గల అభిజిత్ ఫెర్రో ఎల్లాయిస్ కార్మాగారం తాత్కాలికంగా మూతపడడంతో అందులో పనిచేస్తున్న కార్మికులు, వారి కుటుంబ సభ్యులు ఆందోళన చెందుతున్నారు. గత ప్రభుత్వ ప్రోత్సాహం లేకపోవడం వల్లే ఇది జరిగిందని కొందరు వాపోతున్నారు. విద్యుత్ ధరలు పెంచడంతో పాటు అంతర్జాతీయ మార్కెట్‌లో ఫెర్రో ఉత్పత్తుల ధరలు తగ్గిపోవడం ఇందుకు కారణంగా కార్మికులతో పాటు ప్రతినిధులు పేర్కొంటున్నారు. ఈ పరిస్థితుల్లో కూటమి ప్రభుత్వంపైనే కోటి ఆశలు పెట్టుకున్నారు. ఇదిలావుంటే, కార్మికులు విధులకు రాకుండా ప్రతి రోజూ వచ్చి సంతకాలు చేసి వెళ్లిపోతే పదిహేను రోజుల జీతం ఇస్తామని కర్మాగారం యాజమాన్యం ప్రతిపాదించింది. సుదూర ప్రాంతాల నుంచి వచ్చే తమకు పెట్రోలు, రవాణా చార్జీలు భారంగా మారుతాయని సగం జీతం ఎలా సరిపోతుందని కార్మికులు అంటున్నట్టు సమాచారం. ఇదిలావుంటే, తమకు నెలలో నాలుగు ఆదివారాలు పోను 26 రోజులు జీతం ఇవ్వాలని కార్మిక సంఘాల నాయకులు డిమాండ్ చేశారని, దీనికి యాజమాన్యం అంగీకరించేదని తెలిసింది. ఈ కర్మాగారం తాత్కాలికంగా మూత పడడంపై ఎలమంచిలి ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్ స్పందించారు. కర్మాగారం మూతపడడం వల్ల ప్రత్యక్షంగా మూడువేల మంది, పరోక్షంగా వేలాదిమంది ఉపాధి కోల్పోతున్నారని, ఈ విషయాన్ని సీఎం చంద్రబాబునాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌ల దృష్టికి తీసుకువెళ్లి సమస్య పరిష్కారానికి తనవంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు.

'యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలి'

చట్టవ్యతిరేకంగా కర్మాగారాన్ని మూసివేసిన అభిజిత్ యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి జి.కోటేశ్వరరావు డిమాండ్ చేశారు. సంస్థ కార్యాలయం ముందు ఆందోళన చేస్తున్న కార్మికులకు మంగళవారం సంఘీభావం తెలిపి మాట్లాడారు. కార్మికులకు కనీస సమాచారం కూడా ఇవ్వకుండా మూసివేయడం అన్యాయమన్నారు. అభిజిత్ యాజమాన్యం ఏనాడూ కార్మిక చట్టాల గురించి పట్టించుకోలేదని విమర్శించారు. గతంలో ఆందోళన చేసినప్పుడు డస్ట్ అలవెన్స్, హీట్ అలవెన్స్ ఇస్తామని అంగీకరించి మాట తప్పిందని ఆరోపించారు. అంతకు ముందు అభిజిత్ కార్మాగారం నుంచి పాదయాత్రగా ఏపీఐఐసీ కార్యాలయానికి వెళ్లి జెడ్ఎంకు వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు రొంగలి రాము, కె.సోమునాయుడు, కర్రి అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

తహసీల్దార్ కార్యాలయాన్ని పరిశీలించిన ఆర్డీవో ఆయేషా

» అర్జీలపై అలక్ష్యం వద్దని సూచన


రికార్డులు తనిఖీ చేస్తున్న ఆర్డీవో ఆయేషా

రాంబిల్లి, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి) : ఇక్కడి తహసీల్దార్ కార్యాలయాన్ని అనకాపల్లి ఆర్డీవో షేక్ ఆయేషా మంగళవారం సందర్శించారు. కొత్తగా బాధ్యతలు చేపట్టి తొలిసారిగా ఇక్కడికి వచ్చిన ఆమె తహసీల్దార్, కార్యాయం సిబ్బందితో సమావేశమయ్యారు. రెవెన్యూ శాఖ పరమైన సమస్యల పరిష్కారంలో జాప్యం చూపవద్దన్నారు. సిబ్బంది సమయ పాలనను విధిగా పాటించాలని ఆదేశించారు. అనంతరం రికార్డులను తనిఖీ పలు సూచనలు చేశారు. ప్రధానంగా ప్రజల నుంచి వచ్చే అర్జీల పరిష్కారంలో ఎటువంటి నిర్లక్ష్యం చూపరాదన్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ శ్రీనివాసరావు, రాంబిల్లి సీఐ నర్సింగరావు, ఆర్ఐ రవికుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

మారుమూల గ్రామాలు సైతం అభివృద్ధి చెందాలి

» పల్లె పండుగలో ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్


మెలిపాకలో శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే విజయకుమార్

మునగపాక (తుమ్మపాల), అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలో మారుమూల గ్రామాలను సైతం అభివృద్ధి చేయడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని ఎలమంచిలి ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్ అన్నారు. పల్లె పండుగ కార్యక్రమంలో భాగంగా మంగళవారం ఆయన మునగపాక మండలం మెలిపాక, చూచుకొండ, గణపర్తి, తిమ్మరాజుపేట, వాడ్రాపల్లి గ్రామాల్లో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసి మాట్లాడారు. గ్రామాల్లో సీసీ రోడ్డు, డ్రైన్లు నిర్మాణాలు చేపట్టి ప్రజలకు ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకుంటున్నామన్నారు. టీడీపీ మండల అధ్యక్షుడు దొడ్డి శ్రీనివాసరావు, నాయకులు మళ్ల జయలక్ష్మి, ఆడారి మంజు, భీమరశెట్టి శ్రీనివాసరావు, దాడి ముసిలినాయుడు, రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

రాంబిల్లి మండలంలో...

రాంబిల్లి : మండలంలోని ఏడు పంచాయతీల్లో మంగళవారం పల్లె పండుగ కార్యక్రమాన్ని నిర్వహించారు. కొత్తపట్నం, వాడనర్సాపురం, గోవిందపాలెం, కొత్తపేట, కొప్పుగొండుపాలెం, రాంబిల్లి, జడ్.చింతువా పంచాయతీలలో ఎంపీడీవో జయమాధవి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమాల్లో సుమారు రూ.70 లక్షలతో సీసీ రోడ్లు, డ్రైనేజీల నిర్మాణానికి శంకుస్థాపనలు చేశారు. ఈ కార్యక్రమాల్లో ఈవోపీఆర్‌డీ రాజు, టీడీపీ, జనసేన మండల శాఖల అధ్యక్షులు వి.దినబాబు, పప్పల నూకన్నదొర, రాంబిల్లి పీఏసీఎస్ మాజీ అధ్యక్షులు కలిదిండి రఘు, కొప్పుగొండుపాలెం, వాడనర్సాపురం సర్పంచ్‌లు బి.హరి, కె.రామారావు, కొత్తపట్నం మాజీ సర్పంచ్ చోడిపల్లి సత్యనారాయణ, బి.రమణ, వాడనర్సాపురం మాజీ ఎంపీటీసీ చెల్లూరి దేముడు, పెదకలవలాపల్లి మాజీ సర్పంచ్ కర్రి సింహగిరి ప్రసాద్, జడ్.చింతువా మాజీ సర్పంచ్ ఎరిపిల్లి చిట్టిబాబు, తెలుగుయువత మండల అధ్యక్షుడు ఎరిపల్లి అజయ్, టీడీపీ నేత ఉమ్మిడి నాగేష్, ఆయా గ్రామాల కూటమి నాయకులు, పలువురు అధికారులు పాల్గొన్నారు.


రాంబిల్లి : కొప్పుగొండుపాలెంలో సీసీ రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన

యాజమాన్య పద్ధతులు పాటిస్తే వరిలో అధిక దిగుబడి


గోకివాడలో వరి పొలాన్ని పరిశీలిస్తున్న ఏవో సమంత, సిబ్బంది

రాంబిల్లి, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి) : వరి పంట సాగులో యాజమాన్య పద్ధతులు పాటించడం ద్వారా నాణ్యమైన దిగుబడులు సాధించవచ్చునని ఏవో సి.సుమంత అన్నారు. మర్రిపాలెం, గోకివాడ గ్రామాల్లో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె వరి పంటకు ఆశించిన తెగుళ్లను గుర్తించి సస్యరక్షణ చర్యలు చేపట్టాలని రైతులకు సూచించారు. గోకివాడ గ్రామ నాయకులు ఎన్.వి.సూర్యనారాయణ, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది శ్రీనివాస్, నూకరత్నం, ఫిషరీస్ అసిస్టెంట్ రోహిణి కుమార్, యార్డు అసిస్టెంట్ జి.వి.రమణ, ఏహెచ్‌ఏలు చిట్టిబాబు, నాగేశ్వరరావు, ఎంపీఈవో సరోజిని పాల్గొన్నారు.

స్పీకర్ అయ్యన్నపాత్రుడిని కలిసిన 'ప్రగడ'

ఎలమంచిలి, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి) : శాసన సభ స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు తానా సభలు ముగించుకుని అమెరికా నుంచి స్వదేశానికి తిరిగి వచ్చిన సందర్భంగా ఎలమంచిలి టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ ప్రగడ నాగేశ్వరరావు మంగళవారం ఆయనను మర్యాద పూర్వకంగా కలిశారు. పుష్పగుచ్ఛాన్ని అందజేసిన అనంతరం నియోజకవర్గంలో సమస్యలపై చర్చించారు.


అయ్యన్నను సత్కరిస్తున్న నాగేశ్వరరావు


పంచాయతీ కార్యదర్శులతో సమీక్ష జరుపుతున్న డీఎల్‌డీవో ఉదయశ్రీ

ప్రజారోగ్యానికి ప్రాధాన్యం ఇవ్వండి

» పంచాయతీ కార్యదర్శుల సమావేశంలో డీఎల్‌డీవో ఉదయశ్రీ

నక్కపల్లి, అక్టోబరు 15: గ్రామాల్లో ప్రజల ఆరోగ్యానికి, పారిశుధ్య పరిరక్షణకు అధిక ప్రాధాన్యం ఇవ్వాలని డీఎల్‌డీవో ఉదయశ్రీ ఆదేశించారు. మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం పంచాయతీ కార్యదర్శులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సంపద కేంద్రాలను కండిషన్‌లో ఉంచాలని సూచించారు. ప్రతీ రోజు చెత్తను సేకరించి కేంద్రాలకు తరలించాలని ఆదేశించారు. అన్ని గ్రామాల్లో శానిటేషన్ స్పెషల్ డ్రైవ్ చేపట్టాలని, రక్షిత నీటి ట్యాంకులను పరిశుభ్రం చేయించాలని సూచించారు. ఈ సమావేశంలో ఎంపీడీవో సీతారామరాజు, పలు పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.


కార్యదర్శుల సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీవో సత్యనారాయణ

నూతన కార్యదర్శులతో ఎంపీడీవో సమీక్ష

ఎస్.రాయవరం, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): మండలంలో నూతనంగా బాధ్యతలు స్వీకరించిన పంచాయతీ కార్యదర్శులతో ఇన్‌చార్జి ఎంపీడీవో సత్యనారాయణ మంగళవారం సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పల్లె పండగ కార్యక్రమంలో చేపట్టాల్సిన పనులతో పాటు ఇంటి పన్నులు, శానిటేషన్ తదితర అంశాలపై పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమాలను విజయవంతం చేయాలని చెప్పారు.

పీఆర్‌టీయూ సభ్యత్వ నమోదుకు శ్రీకారం

ఎస్.రాయవరం, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పలు ప్రభుత్వ పాఠశాలలను మంగళవారం పీఆర్‌టీయూ నాయకులు సందర్శించి సభ్యత్వ నమోదు కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. ఇందులో భాగంగా పీఆర్‌టీయూ నాయకులకు తాము ఎదుర్కొంటున్న సమస్యలతో పాటు 117 రద్దు వంటి తదితర సమస్యలను ఉపాధ్యాయులు వివరించారు. దీనికి పీఆర్‌టీయూ మండల అధ్యక్షుడు భద్రరావు స్పందిస్తూ ఉపాధ్యాయుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి, వాటిని పరిష్కరించడం కోసం కృషి చేస్తామని చెప్పారు. పీఆర్‌టీయూ సభ్యత్వ నమోదుతో పాటు ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఓటు నమోదు పత్రాలను ఉపాధ్యాయులకు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత చక్రవర్తి, పీఆర్‌టీయూ నాయకులు సత్యనారాయణ, జాన్ సామ్యూల్ రాజ్, రమేష్, శ్రీనివాసరావు, రామారావు తదితరులు పాల్గొన్నారు.

రేషన్ డీలర్ల సమస్యల పరిష్కారానికి కృషి

» ఏపీ సివిల్ సప్లయిస్ స్టేట్ డైరెక్టర్ బి.శివదత్

పాయకరావుపేట, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని రేషన్ డీలర్లు ఎదుర్కొంటున్న సమస్యలను రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి దృష్టికి తీసుకువెళ్లి పరిష్కారానికి కృషిచేస్తానని ఏపీ సివిల్ సప్లయిస్ స్టేట్ డైరెక్టర్ బోడపాటి శివదత్ హామీ ఇచ్చారు. మంగళవారం పాయకరావుపేటలోని పీఆర్ గెస్టు హౌస్‌లో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో శివదత్‌ను రేషన్ డీలర్ల సంఘం నాయకులు ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా తాము ఎదుర్కొంటున్న సమస్యలు ఆయన దృష్టికి తీసుకుని వచ్చారు. అనంతరం శివదత్ మాట్లాడుతూ రాష్ట్రంలో రేషన్ డీలర్ల సమస్యలపై రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్‌తో పాటు ఏపీ సివిల్ సప్లయిస్ చైర్మన్ తోట సుధీర్‌లతో చర్చించి పరిష్కారానికి కృషిచేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో రేషన్ డీలర్ల సంఘం నాయకులు జి.చిట్టిబాబు, అప్పలనాయుడు, టి.శేఖర్, పి.అప్పారావు, దివాణం, కనకరాజు, బుల్లిదొర, శివకృష్ణ తదితరులు పాల్గొన్నారు.


సివిల్ సప్లయిస్ స్టేట్ డైరెక్టర్ శివదత్‌ను సత్కరిస్తున్న రేషన్ డీలర్లు

సీసీ రోడ్ల నిర్మాణాలకు శంకుస్థాపన

పాయకరావుపేట రూరల్, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): పల్లె పండగ కార్యక్రమంలో సీసీ రోడ్లు, డ్రైనేజీల నిర్మాణాలకు ఎంపీడీవో ఎ.జయప్రకాశరావు మంగళవారం శంకుస్థాపన చేశారు. మండలంలోని పెదరాంభద్రపురం, ఎస్.నర్సాపురం, కొత్తూరు గ్రామాలలో మంగళవారం ఈ కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లడుతూ గ్రామసభలలో తీర్మానం చేసిన మేరకు ఉపాధి హామీ పథకం నిధులతో అభివృద్ధి పనులు చేపడుతున్నట్టు చెప్పారు. పెదరాంభద్రపురంలో రూ.7 లక్షలతో సీసీ రోడ్లు, ఎస్.నర్సాపురంలో రూ.13 లక్షలతో రోడ్లు, కొత్తూరులో రూ.5 లక్షలతో అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేశామన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్‌ఆర్‌ఈజీఎస్ ఏపీవో హేమలత, పీఆర్ ఏఈ కచేరి, కార్యదర్శులు వైవీ.సత్యనారాయణ, నాయకులు కలిగట్ల శ్రీనువాసరావు, శింగంశెట్టి నాగేశ్వరరావు, కాండ్రేగుల ధనలక్ష్మి, తాడి నానాజీ, సూరిబాబు, సత్తిబాబు, కొండబాబు, గన్నియ్య, తాతారావు, వి.రామారావు, జి.రామగోవిందు పాల్గొన్నారు.


పెదరాంభద్రపురంలో రోడ్ల నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న నాయకులు

చేతుల శుభ్రతతో వ్యాధులు దూరం


చేతుల శుభ్రతపై విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న వైద్యులు

ఎస్.రాయవరం, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సర్వసిద్ది పీహెచ్‌సీ పరిధిలో ఉన్న పలు ప్రాంతాల్లో మంగళవారం వైద్యులు ఎస్ఎస్‌వీ శక్తిప్రియ, ఎన్.వాసంతి వైద్య సిబ్బందితో కలిసి అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యులు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ఆహారం తీసుకొనే ముందు, ఏదైనా పని చేసిన తరువాత, అలాగే ఆటలు ఆడిన తరువాత కచ్చితంగా ఏడు పద్ధతుల్లో చేతులను శుభ్రం చేసుకోవాలని చెప్పారు. దీనివల్ల బ్యాక్టీరియా, ఫంగస్, వైరస్‌ల ద్వారా సంభవించే వ్యాధుల నుంచి రక్షణ పొందవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది ఎం.రత్న సఖి, ఎస్ఎస్‌వీ ప్రకాష్, పీఎస్‌వీఎస్ ప్రసాద్, ప్రేమ్‌కుమార్ పాల్గొన్నారు.

డిస్లెక్సియాపై అవగాహన ర్యాలీ

పాయకరావుపేట, అక్టోబరు 15: పీహెచ్.వాడ పాఠశాలలో సహిత విద్యా విభాగం ఆధ్వర్యంలో మంగళవారం డిస్లెక్సియాపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఈవో-2 రమేష్ మాట్లాడుతూ ప్రత్యేక అవసరాలుగల పిల్లల పురోభివృద్ధి, నిర్దిష్ట అభ్యాస వైకల్యాలపై అవగాహన కోసం ఈ ర్యాలీ చేశామన్నారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు అనంతలక్ష్మి, అప్పలనాయుడు పాల్గొన్నారు.

నక్కపల్లిలో...

నక్కపల్లి: గొడిచెర్ల జడ్పీ హైస్కూల్ పరిధిలోని గొడిచెర్ల కొత్తూరు, డొంకాడ కొత్తూరు గ్రామాల్లో పిల్లల్లో అభ్యాసన వైకల్యాన్ని ఎలా అధిగమించాలి? అనే అంశంపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఈవో-2 వేమగిరి నూకరాజు మాట్లాడుతూ దివ్యాంగులు చదివితే అందరూ చదివినట్టేనని, వారిని ప్రోత్సహించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ప్రత్యేక విద్య బోధకులు యాస్మిన్ పాల్గొన్నారు.

అబ్దుల్ కలాంకు నివాళులు

నక్కపల్లి, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): మండల పరిషత్ కార్యాలయం వద్ద మాజీ రాష్ట్రపతి డాక్టర్ అబ్దుల్ కలాం జయంతి నిర్వహించారు. కలాం చిత్రపటానికి తహసీల్దార్ నరసింహమూర్తి, ఎంపీడీవో సీతారామరాజు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ముఖ్య అతిథిగా డీఎల్‌డీవో ఉదయశ్రీ హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో ఉపాధి పథకం, మండల ఇంజనీరింగ్ విభాగం అధికారులు పాల్గొన్నారు.

పల్లెల్లో పొలం పిలుస్తోంది...


ఎరువు వినియోగం, తెగుళ్ల నివారణపై అవగాహన కల్పిస్తున్న ఏవో సరోజిని

కోటవురట్ల, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కొడవటిపూడి, కె.వెంకటాపురం గ్రామాల్లో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని వ్యవసాయ శాఖ అధికారులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎరువు వినియోగంపై రైతులకు ఏవో సరోజని అవగాహన కల్పించారు. ముఖ్యంగా పొటాష్ వల్ల కలిగే ఉపయోగాలను వివరించారు. ఆకుముడత, పాముపొడ తెగులు నివారణకు క్లోరిపైరిఫోస్ రెండు ఎంఎల్, హెక్సాకొనజోల్ రెండు ఎంఎల్ ఒక లీటరు నీటిలో కలిపి పిచికారీ చేయాలని సూచించారు. అనవసరంగా ఎక్కువ సాంద్రత గల మందులు పిచికారీ చేయకూడదని ఆమె తెలిపారు.

నక్కపల్లిలో...

నక్కపల్లి: మండలంలోని పెదదొడ్డిగల్లు, నక్కపల్లి గ్రామాల్లో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా రైతులకు వరిలో సమగ్ర సస్యరక్షణ చర్యలపై అవగాహన కల్పించారు. చీడపీడలు పెరుగుతున్న ప్రస్తుత పరిస్థితుల్లో సమగ్ర సస్యరక్షణ చర్యలే కీలకమని బీసీటీ కృషి విజ్ఞాన కేంద్రం సస్యరక్షణ శాస్త్రవేత్త బండి నాగేంద్రప్రసాద్ చెప్పారు. ఈ కార్యక్రమంలో ఏవో ఉమాప్రసాద్, బీసీటీ కృషి విజ్ఞాన కేంద్రం సీనియర్ శాస్త్రవేత్త శైలజా కుర్రా, జిల్లా వనరుల కేంద్రం అధికారిణి తులసీమణి, టీడీపీ మండల అధ్యక్షుడు కొప్పిశెట్టి వెంకటేశ్ తదితరులు పాల్గొన్నారు.

ఎస్.రాయవరంలో...

ఎస్.రాయవరం: ఎస్‌రాయవరం, ధర్మవరం అగ్రహారం గ్రామాల్లో మంగళవారం పొలం పిలుస్తోంది నిర్వహించినట్టు ఏవో సౌజన్య తెలిపారు. గ్రామాల్లో వరి పొలాలను సందర్శించి చీడపీడల నివారణపై రైతులకు అవగాహన కల్పించామన్నారు. గొంగళి పురుగు, సుడిదోమ నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను ఏవో వివరించారు.

నేత్రదానంపై అవగాహన

ఎస్.రాయవరం: సర్వసిద్ది పీహెచ్‌సీ వద్ద వైద్యులు శక్తిప్రియ, బి.వెంకటరావు ఆధ్వర్యంలో నేత్రదానంపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పీహెచ్‌సీ వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

నూకాంబికను దర్శించుకున్న సినీనటులు



నటుడు సుధాకర్‌కు అమ్మవారి చిత్రపటాన్ని అందిస్తున్న టీడీపీ నాయకులు

అనకాపల్లి టౌన్, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి) : నూకాంబిక అమ్మవారిని సినీనటులు మంగళవారం దర్శించుకున్నారు. 'లైఫ్ ఈజ్ బ్యూటీఫుల్ చిత్రంలో నటించిన సుధాకర్, భామాకలాపం, కంచరపాలెం చిత్రాల్లో నటించిన కిశోర్‌లు ఆలయానికి విచ్చేశారు. వీరికి టీడీపీ నాయకులు మళ్ల సురేంద్ర, దాడి జయవీర్ ఘన స్వాగతం పలికారు. దర్శనం అనంతరం సత్కరించి అమ్మవారి చిత్రపటాలను బహూకరించారు. ఈ కార్యక్రమంలో వెంకటేష్ హెల్పింగ్ హ్యాండ్స్ రాష్ట్ర వ్యవస్థాపకులు పి.చందు, కార్తీక్ తదితరులు పాల్గొన్నారు.

కత్తిసాము పోటీల్లో డీపీఎన్ విద్యార్థి ప్రతిభ



పోటీలకు ఎంపికైన గుణశేఖర్

కశింకోట, అక్టోబర్ 15 (ఆంధ్రజ్యోతి) :రాష్ట్రస్థాయి కత్తిసాము (ఫెన్సింగ్) పోటీలకు ఇక్కడి డీపీఎన్ జిల్లా పరిషత్ పాఠశాల విద్యార్థి ఎంపికైనట్టు ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయుడు ఆచంట రవి తెలిపారు. ఇటీవల చోడవరం మండలం గోవాడ జిల్లా పరిషత్ పాఠశాలలో జరిగిన ఈ పోటీల్లో తమ పాఠశాల నుంచి కె.గుణశేఖర్ పాల్గొని అండర్ -17 ఫోయిల్ స్టయిల్ విభాగంలో అద్భుత ప్రతిభ చూపాడన్నారు. దీంతో నంద్యాలలో త్వరలో జరగనున్న రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక చేసినట్టు చెప్పారు. ఈ సందర్భంగా గుణశేఖర్‌ను ఉపాధ్యాయులు ఎం.ఆర్.వి.అప్పారావు, ఎస్‌జె.వి.ప్రసాద్, ప్రభాకర్, అప్పారావు, పాఠశాల యాజమాన్య కమిటీ ఛైర్మన్ నక్కా నాగమణి, గ్రామ పెద్దలు అభినందించారు.

మద్యం షాపు ఏర్పాటు చేయవద్దని ఆందోళన



శారదానగర్ రెండో వీధిలో మద్యం షాపు వద్దని స్థానికులు నినాదాలు

కొత్తూరు, అక్టోబర్ 15 (ఆంధ్రజ్యోతి) : అనకాపల్లి మండలంలోని మేజర్ పంచాయతీ కొత్తూరు శారదానగర్‌లో రెండో వీధికి వెళ్లే ప్రధాన రోడ్డులో మద్యం దుకాణం ఏర్పాటు చేయ వద్దంటూ స్థానికులు మంగళవారం రాత్రి ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా శారదానగర్ పరిరక్షణ సమితి ప్రతినిధులు తాడి శ్రీనివాస చక్రవర్తి, వేపాడ సత్తిబాబు, పి.రామకృష్ణ, వర్మ, నీటిపల్లి రాజు, జయబాబు, భారతి, వెంకటలక్ష్మి, సుజాత తదితరులు షాపింగ్ కాంప్లెక్స్ వద్దకు చేరుకున్నారు. వైన్‌షాపును నిత్యం జనసంచారం ఉన్న ఈ ప్రాంతంలో ఏర్పాటు చేసేందుకు వీలు లేదంటూ ధర్నాకు దిగారు. విషయాన్ని తెలుసుకున్న పట్టణ సీఐ విజయ్‌కుమార్ ఘటనా స్థలానికి వెళ్లి షాపు అద్దెకు ఇచ్చిన యజమానితో మాట్లాడారు. ఇక్కడ మద్యం షాపు ఇచ్చేందుకు తాను అనుమతించేది లేదని తెలియజేయడంతో నిరసనను విరమించుకున్నారు. కాగా, జనసంచారం లేనిచోట మద్యం షాపు ఏర్పాటు చేసుకునేందుకు తమకు ఎటువంటి అభ్యంతరం లేదని స్థానికులు తెలిపారు.

వరి పొలాల్లో తెగుళ్ల నివారణకు సూచనలు



మామిడిపాలెంలో మాట్లాడుతున్న ఏవో రంగాచారి

తుమ్మపాల/కొత్తూరు, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి) : అనకాపల్లి మండలంలోని వెంకుపాలెం, బవులవాడ గ్రామాల్లో మంగళవారం వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మండల వ్యవసాయాధికారి పి.రంగాచారి మాట్లాడుతూ రైతులకు పలు సూచనలు చేశారు. వరి పొలాల్లో తెగుళ్ల, పురుగుల ఉధృతి అధికంగా ఉందని గుర్తించినట్టు చెప్పారు. ఆకుముడత, పొడ తెగుళ్ల నివారణకు రెండు మిల్లీ లీటర్ల హెక్సాకొనజోల్ మందును లీటరు నీటిలో, అలాగే, ఆకుముడత నివారణకు క్లోరిఫైరిఫాస్ లీటరు నీటిలో రెండు మిల్లీ లీటర్లు కలిపి పిచికారీ చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయాధికారులు మురళీ, ఎం.రామారావు, నాయకులు నూకరాజు, నాగేశ్వరరావు, విజయ్, జ్యోతి మోహన్ తదితరులు పాల్గొన్నారు.

రెవెన్యూ సమస్యలు పరిష్కరించండి



తహసీల్దార్ కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న టీడీపీ శ్రేణులు

పరవాడ, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి) : ఇక్కడి తహసీల్దార్ ఎస్‌వీ అంబేద్కర్‌ను మంగళవారం టీడీపీ మండల నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పుష్పగుచ్ఛాన్ని అందజేసి సత్కరించారు. రెవెన్యూ శాఖ పరమైన సమస్యల పరిష్కారానికి చొరవ చూపాలని వారంతా కోరారు. టీడీపీ మండల అధ్యక్షుడు వియ్యపు చిన్న, ఇందల కొండలరావు, కేఆర్‌కే రాజు, బొండా సన్నిదేముడు, కూండ్రపు శ్రీరామ్మూర్తి, బొండా తాతారావు, పైలా రథాల సన్యాసిరావు, పైలా వరలక్ష్మి, గండి లక్ష్మి, బోజంకి నాయుడు తదితరులు పాల్గొన్నారు.

పల్లె ప్రగతికి ప్రభుత్వం కంకణం

» అర్బన్ ఫైనాన్స్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఛైర్మన్ పీలా » పలు గ్రామాల్లో అభివృద్ధి పనులకు శంకుస్థాపన



జోగారావుపేటలో సీసీ రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపనలో పీలా గోవింద తదితరులు



కోడూరులో జరిగిన పల్లె పండుగలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్సీ బుద్ద నాగజగదీశ్వరరావు

కశింకోట, అక్టోబర్ 15 (ఆంధ్రజ్యోతి) : గ్రామీణ ప్రాంతాలను అభివృద్ధి చేయడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర అర్బన్ ఫైనాన్స్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఛైర్మన్ పీలా గోవింద సత్యనారాయణ అన్నారు. మంగళవారం మండలంలోని తేగాడ, పేరంటాలపాలెం, జోగారావుపేట, కొత్తపల్లి, బుచ్చయ్యపేట గ్రామాల్లో జరిగిన పల్లె పండుగ-పంచాయతీ వారోత్సవాల్లో మాట్లాడారు. పల్లెల ప్రగతితోనే దేశాభివృద్ధి సాధ్యమన్నారు. అనంతరం రోడ్లు, కాలువలు నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. అదే విధంగా పేరంటాలపాలెం గ్రామంలో క్రెబ్స్ కంపెనీ యాజమాన్యం ఏర్పాటు చేసిన వాటర్ ప్లాంట్‌ను ఆయన ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మండల ప్రత్యేకాధికారిణి రోజారాణి, ఎంపీడీవో ఎ.రవికుమార్, నాయకులు వేగి గోపీకృష్ణ, సిదిరెడ్డి శ్రీను తదితరులు పాల్గొన్నారు.

అనకాపల్లి రూరల్ : మండలంలోని మారేడుపూడి, అక్కిరెడ్డిపాలెం, గొలగాం, కోడూరు, గోపాలపురం, గ్రామాల్లో మంగళవారం పల్లె పండుగ కార్యక్రమాలు నిర్వహించారు. మారేడుపూడి, అక్కిరెడ్డిపాలెం గ్రామాల్లో ఈ కార్యక్రమానికి అర్బన్ ఫైనాన్స్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఛైర్మన్ పీలా గోవింద సత్యనారాయణ, గొలగాం, కోడూరు, గోపాలపురంలలో నిర్వహించిన పల్లె పండగకు మాజీ ఎమ్మెల్సీ బుద్ద నాగజగదీశ్వరరావు హాజరై అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. సర్పంచ్‌లు సాలాపు కనకరాజు, సాలాపు శాంతి, నాయకులు ఈగల వెంకునాయుడు, బాదపు రాంబాబు, తలారి కాశీనాయుడు తదితరులు పాల్గొన్నారు.

పరవాడ : పల్లె పండుగ కార్యక్రమంలో భాగంగా మండలంలో గల పదిహేను పంచాయతీల్లో రూ.6.74 కోట్లతో పలు అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టనున్నట్టు ఎంపీడీవో ఎస్‌డీ శ్యామ్‌సుందర్ మంగళవారం విలేకరులకు తెలిపారు. మండల వ్యాప్తంగా 65 పనులను చేపట్టేందుకు గ్రామ సభల్లో ఇది వరకే తీర్మానం చేసినట్టు చెప్పారు. ఇందులో భాగంగానే సీసీ రోడ్లు, కాలువల నిర్మాణం చేపట్టడం జరుగుతుందన్నారు. ఈ ఏడాది డిసెంబరు 31నాటికి పనులను పూర్తి చేస్తామన్నారు. అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే పంచకర్ల రమేష్‌బాబు చేతుల మీదుగా శంకుస్థాపనలు చేయిస్తామన్నారు. వచ్చే ఏడాది జనవరిలో మళ్లీ పల్లె పండుగ వారోత్సవాలను జరిపి అభివృద్ధి పనులను ప్రారంభోత్సవం చేస్తామని వివరించారు. ఉపాధి హామీ పథకం నిధులతో అభివృద్ధి కార్యక్రమాలు చేపడతామని ఎంపీడీవో స్పష్టం చేశారు. ఇదిలావుంటే, పల్లె పండుగ- పంచాయతీ వారోత్సవాల్లో భాగంగా ఎమ్మెల్యే పంచకర్ల రమేష్ బాబు బుధవారం మండలంలోని పలు పంచాయతీల్లో పర్యటించి అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేయనున్నారు. తొలుత పెదముషిడివాడలో అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తారని అనంతరం కన్నూరు, తానాం, భరిణికం, పరవాడ, వెన్నెలపాలెం, గొర్లివానిపాలెం, ఈ.బోనంగి పంచాయతీల్లో పర్యటిస్తారని జనసేన పార్టీ నాయకులు తెలిపారు. ఉదయం ఎనిమిది గంటల నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు పర్యటన కొనసాగుతుందన్నారు. అంతా విజయవంతం చేయాల్సిందిగా వారు కోరారు.

సబ్బవరం : మండల కేంద్రం సబ్బవరంలో పలు గ్రామాల్లో పల్లె పండుగ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎమ్మెల్యే పంచకర్ల రమేశ్‌బాబు హాజరై రూ.1,67,50,000 విలువైన అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేశారు. బంగా రమ్మపాలెంలో తొమ్మిది, పనులు, ఆరిపాకలో మూడు, నల్లరేగుల పాలెంలో రెండు, గాలిభీమవ రంలో ఆరు, టెక్కలి పాలెంలో ఒకటి, వంగలిలో మూడు, అంతకాపల్లిలో నాలుగు పనులకు ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు. త్వరలోనే ఈ పనులు ప్రారంభం కానున్నారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులతో పాటు కూటమి నాయకులు పాల్గొన్నారు.

డిస్లెక్సియాను నిర్లక్ష్యం చేయవద్దు

» జిల్లా సహిత విద్యా సమన్వయ అధికారిణి శకుంతల



మామిడిపాలెంలో ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు, ఉపాధ్యాయులు

తుమ్మపాల, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి) : డిస్లెక్సియా (భాషా అవరోధ బలహీనతన)ను నిర్లక్ష్యం చేయవద్దని జిల్లా సహిత విద్యా సమన్వయ అధికారిణి బి.శకుంతల అన్నారు. మామిడిపాలెంలో మంగళవారం ఈ వ్యాధిపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ దాదాపుగా ఎనభై శాతం మంది డిస్లెక్సియా బాధితులుగా ఉన్నారని పేర్కొన్నారు. జన్యు కారణాలతో ఏర్పడిన నాడీ సంబంధిత వ్యాధిగా దీనిని పేర్కొన్నారు. శరీరంలోని వివిధ భాగాల్లో సమన్వయం లోపిస్తే డిస్లెక్సియాగా గుర్తించాలని సూచించారు. దీనికి సంబంధించి అవగాహన పెంచుకుని నివారణకు వైద్యుల సలహా మేరకు చికిత్సను పొందాలన్నారు. అంతకుముందు విద్యార్థులంతా గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

'గ్రామాల అభివృద్ధిలో వార్డు సభ్యులదే కీలక పాత్ర'



శిక్షణ శిక్షణ శిబిరంలో మాట్లాడుతున్న ఈవోపీఆర్‌డీ చైతన్య

సబ్బవరం, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): గ్రామాల అభివృద్ధిలో వార్డు సభ్యులదే కీలక పాత్ర అని ఈవోపీఆర్‌డీ చైతన్య అన్నారు. ఇక్కడి మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో మంగళవారం ఉప సర్పంచ్‌లు, వార్డు సభ్యులకు ఏర్పాటైన శిక్షణ శిబిరంలో మాట్లాడారు. గ్రామ సభల నిర్వహణ, గ్రామాభివృద్ధికి ప్రణాళిక తయారు, వీధి దీపాల నిర్వహణ, లే-అవుట్ల అప్రూవల్‌కు తీసుకోవలసిన అంశాలు, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నిధులు నిర్వహణ, గ్రామ పంచాయతీల ఆస్తుల రక్షణ, ఆదాయ వనరులు సమకూర్చుకోవడం వంటి అంశాలపై వివరించారు. ఏవో కె.శివప్రసాద్, శిక్షకులు గుల్లేపల్లి కార్యదర్శి విష్ణు పాల్గొన్నారు

వీఆర్‌ఏల సమస్యలు పరిష్కరించాలని వినతి



తహసీల్దార్ చిన్నికృష్ణను కలిసిన వీఆర్‌ఏలు

సబ్బవరం, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి) : దీర్ఘకాలంగా అపరిష్కృతంగా ఉన్న తమ సమస్యల పరిష్కారానికి కృషి చేయాల్సిందిగా తహసీల్దార్ బి.చిన్ని కృష్ణను మండలంలోని వీఆర్‌ఏలు కోరారు. నూతనంగా బాధ్యతలు చేపట్టిన ఆయనను మంగళవారం వీఆర్‌ఏల సంఘం అధ్యక్షుడు నీటిపల్లి గంగాధరరావు ఆధ్వర్యంలో పలువురు కలిసి పుష్పగుచ్ఛాలను అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా గంగాధర్ మాట్లాడుతూ పలు గ్రామాల్లో వీఆర్‌ఏల పోస్టులు ఖాళీగా ఉన్నాయన్నారు. ఆయా గ్రామాల్లో కొత్త వారిని నియమించేలా చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో వీఆర్‌ఏలు ఎం.అప్పారావు, నర్సింగరావు, భాగ్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

'గ్రామ సభలకు వీఆర్‌వోలు సిద్ధంగా ఉండాలి'



వీఆర్‌వోలతో మాట్లాడుతున్న తహసీల్దార్ విజయ్‌కుమార్

అనకాపల్లి టౌన్, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి) : భూముల రీ సర్వే జరిగిన గ్రామాల్లో ఈ నెల 17వ తేదీ గురువారం నుంచి నిర్వహించే సభలకు రికార్డులతో సిద్ధంగా ఉండాలని తహసీల్దార్ కె. విజయ్‌కుమార్ వీఆర్‌వోలకు సూచించారు. మంగళవారం కార్యాలయంలో జరిగిన వీఆర్‌వోల సమావేశంలో మాట్లాడారు. భూముల రీసర్వేలో లోటుపాట్లు ఉంటే రైతులు ఈ గ్రామ సభలను సద్వినియోగం చేసుకుని లోపాలను సరి చేయించుకోవాలన్నారు. మండలంలో భూములు రీసర్వే చేసిన 20 గ్రామాల్లో సభలు నిర్వహించనున్నట్టు చెప్పారు. ఏమైనా లోటుపాట్లు ఉంటే అక్కడికక్కడే సరిచేసి రైతుల సమస్యలను పరిష్కరించాలని వీఆర్‌వోలకు ఆయన ఆదేశించారు. అలాగే సర్వే రాళ్లపై గత ప్రభుత్వ హయాంలో ఏర్పాటు చేసిన జగనన్న భూరక్ష స్టిక్కర్లు, రంగులను తొలగించాలని స్పష్టం చేశారు. డిప్యూటీ తహసీల్దార్ వై.శ్రీరామ్మూర్తి, ఆర్‌ఐ రమేష్, సర్వేయర్, పాల్గొన్నారు.

18న కొబ్బరి చెక్కలు, తలనీలాలకు వేలం

సబ్బవరం, అక్టోబరు15 (ఆంధ్రజ్యోతి): మండలంలోని లింగాలతిరుగుడు సోమలింగేశ్వరస్వామి దేవస్థానంలో కార్తీకమాసం సందర్భంగా నవంబరు రెండు నుంచి డిసెంబరు ఒకటో తేదీ వరకు భక్తులు సమర్పించిన కొబ్బరి చెక్కలు, తలనీలాలకు సంబంధించి ఈనెల 18వ తేదీన దేవస్థానం కార్యాలయం వద్ద టెండర్, బహిరంగ వేలం పాటు నిర్వహించనున్నామని ఆలయ కార్యనిర్వహణాధికారి బి.మురళీ ఒక ప్రకటనలో తెలిపారు. ఆ రోజు ఉదయం పదకొండు గంటలకు ప్రారంభం కానున్న ఈ ప్రక్రియలో పాల్గొనదలచిన ఔత్సాహికులు కొబ్బరి చెక్కలకు ధరావత్తుగా రూ.ఐదు వేలు, తలనీలాలకు రూ.వెయ్యి చెల్లించి పాటలో పాల్గొన వచ్చునన్నారు. పాట ముగిసిన వెంటనే హెచ్చు పాటదారుడు సదరు పైకం చెల్లించాల్సి ఉంటుందని తెలిపారు. మరిన్ని వివరాలకు కార్యాలయంలో సంప్రదించాల్సిందిగా కోరారు.

'న్యాయ సేవలకు హెల్ప్‌లైన్ నంబర్ నియోగించుకోండి'

అనకాపల్లి టౌన్, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి) : బాధితులు తమ సమస్యలపై న్యాయసేవలు కోసం హెల్ప్‌లైన్ నంబర్ 15100ను సద్వినియోగం చేసుకోవాలని మండల లీగల్ సర్వీస్ అథారిటీ ఛైర్మన్ శ్రీవిద్య మంగళవారం తెలిపారు. సుప్రీం కోర్టు మార్గదర్శకాల మేరకు నేషనల్ లీగల్ సర్వీస్ మేనేజ్‌మెంట్ సిస్టమ్ పోర్టల్ ప్రజల కోసం ఉచిత హెల్ప్‌లైన్ నంబర్‌ను ఏర్పాటు చేసిందన్నారు. బాధితులు ఎవరైనా తమ సమస్యలపై న్యాయ సంబంధిత సేవల కోసం సదరు నంబరుకు ఫోన్ చేసి సహాయం పొందవచ్చనని వివరించారు.

'సాగర్ సిమెంటు' డ్రైవర్ల నిరసన

కశింకోట, అక్టోబర్ 15 (ఆంధ్రజ్యోతి) : బయ్యవరం వద్ద ఉన్న సాగర్ సిమెంటు ఫ్యాక్టరీలోని డ్రైవర్ల నిరసన కార్యక్రమంలో మంగళవారం రెండోరోజుకు చేరుకుంది. కార్మికులకు, యాజమాన్యానికి మధ్య జరిగిన చర్చలు విఫలం కావడంతో నిరసనలు కొనసాగించారు. ఈ సందర్భంగా ట్రాన్స్‌పోర్టు ప్రతినిధులు, సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు శంకర్, దాకారపు శ్రీనివాసరావు మాట్లాడుతూ గత ఐదేళ్ళ నుంచి ఇప్పటి వరకు వేతనాలు పెరగలేదని, ఇతర బెనిఫిట్స్ కూడా ఇవ్వలేదన్నారు. ఇప్పుడైనా సమస్యలు పరిష్కరించాలని కోరారు.

అనకాపల్లి ఇన్‌చార్జి జడ్సీగా చిరంజీవులు



అనకాపల్లి టౌన్, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి) :అనకాపల్లి ఇన్‌చార్జి జోనల్ కమిషనర్‌గా ఎస్. చిరంజీవులు నియమితులయ్యారు. ఇప్పటి వరకు ఇక్కడ జడ్సీగా పనిచేసిన అయ్యప్పనాయుడుకు బదిలీ కావడంతో ఈ నెల నాలుగో తేదీన ఆయన రిలీవ్ అయి రామచంద్రపురం మున్సిపాలిటీకి వెళ్లారు. అప్పటి నుంచి జోనల్ కమిషనర్‌గా ఎవరినీ నియమించ లేదు. ఎట్టకేలకు జీవీఎంసీ ఉన్నతాధికారులు జీవీఎంసీ అనకాపల్లి జోన్‌లో ఈఈగా వ్యవహరిస్తున్న చిరంజీవులును మంగళవారం ఇన్‌చార్జి జడ్సీగా నియమించారు.

రూ.10ల నాణేలపై ప్రచారం



దుకాణదారుకి నాణేలు అందిస్తున్న దృశ్యం

అనకాపల్లి టౌన్, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని మెయిన్ రోడ్డులో యూనియన్ బ్యాంక్ సిబ్బంది మంగళవారం పది రూపాయల నాణేలపై విస్తృత ప్రచారం నిర్వహించారు. దుకాణాల వద్దకు వెళ్లి నాణేలను పంపిణీ చేశారు. పది రూపాయల నాణేలను ఎవరైనా ఇచ్చినా తీసుకోవాలని, మీరు కూడా ఇవ్వవచ్చనని ప్రచారం చేశారు. బ్యాంక్ డిప్యూటీ మేనేజర్ నానాజీ మాట్లాడుతూ పది రూపాయల నాణేలు చెల్లుతాయని అందరూ ఈ విషయాన్ని గుర్తించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో బ్యాంకు ఉద్యోగులు కాండ్రేగుల హరికృష్ణ, ఆదారి రాము తదితరులు పాల్గొన్నారు.

'పీలా'కు నాయకులు సత్కారం



పీలాకు చిత్రపటం అందిస్తున్న నేతలు

అనకాపల్లి టౌన్, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి) : అర్బన్ ఫైనాన్స్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఛైర్మన్‌గా ఇటీవల నియమితులైన మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద సత్యనారాయణను కూటమి నాయకులు మంగళవారం ఇక్కడి టీడీపీ కార్యాలయంలో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా 80వ వార్డు టీడీపీ ఇన్‌చార్జి బీఎస్ఎంకే జోగినాయుడు, బీజేపీ ఇన్‌చార్జి మారిశెట్టి భాస్కరరావులు ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు బొడ్డేడ మురళీ, బొడ్డేడ శ్రీనివాసరావు, సూరిశెట్టి రాముడు, బుద్ద ఈశ్వరరావు, బుద్ద విశ్వనాథం తదితరులు పాల్గొన్నారు.

పేదలకు అన్నదానం



భోజనం ప్యాకెట్లు అందిస్తున్న దాతలు

అనకాపల్లి టౌన్, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి) : గవరపాలెం దిబ్బవీధిలోని నాగేంద్ర స్వామి ఆలయం వద్ద మంగళవారం పేదలకు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రతి మంగళవారం మాదిరిగా ఈ వారం కొణతాల జయబాబు కుటుంబ సభ్యులు పేదలందరికీ భోజనం ప్యాకెట్లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో బి.రోషన్, కొణతాల శ్రీనివాసరావు, పీలా రమణారావు, యల్లపు సత్యనారాయణ, యల్లపు గోవింద, జయబాబు కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

మాజీ రాష్ట్రపతి అబ్దుల్ కలాంకు ఘన నివాళి



కలాం విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న దాడి రత్నాకర్

అనకాపల్లి టౌన్, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి) : మాజీ రాష్ట్రపతి దివంగత డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం జయంతిని పలు చోట్ల మంగళవారం ఘనంగా నిర్వహించారు. పట్టణంలోని ఉడ్‌పేట వద్ద అబ్దుల్‌కలాం సేవా సంస్థ అధ్యక్షుడు ఆళ్ల ప్రవీణ్ ఆధ్వర్యంలో ఏర్పాటైన ఈ కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి దాడి రత్నాకర్ కలాం విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అబ్దుల్‌కలాం సామాన్య, మధ్యతరగతి కుటుంబంలో జన్మించి దేశం గర్వించదగ్గ అత్యున్నతస్థాయికి చేరుకున్నారన్నారు. డీవీఎన్ కళాశాల ప్రిన్సిపాల్ కోరిబిల్లి రమేష్, చిన్నియాదవ్, ఎస్.బాబి, యల్లపు శ్రీనివాసరావు, దాడి ఈశ్వరరావు, దొడ్డి రమణ, రేబాక ఇంద్రకుమార్ తదితరులు పాల్గొన్నారు.

అలాగే, ఇక్కడి డైట్ ఇంజినీరింగ్ కళాశాలలో కలాం జయంతిని జరిపారు. ఆయన విగ్రహానికి ప్రిన్సిపాల్ డాక్టర్ ఆర్.వైకుంఠరావు పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కళాశాల ఛైర్మన్ దాడి రత్నాకర్ మాట్లాడుతూ అబ్దుల్ కలాం దేశానికి చేసిన సేవలను వివరించారు. వివిధ విభాగాధిపతులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కొత్తూరు : స్థానిక ఏఎంఏఎల్ కళాశాలలో కలాం జయంతిని ఘనంగా నిర్వహించారు. ప్రిన్సిపాల్ డాక్టర్ జి.జయబాబు ఆయన విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం కలాం జీవితంలోని ముఖ్య ఘట్టాలను వివరించారు. వైస్ ప్రిన్సిపాల్ నిరంజన్‌కుమార్, సూపరింటెండెంట్ అనురాధ, అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది పాల్గొన్నారు.



ఏఎంఏఎల్ కళాశాల ఆవరణలో...

తుమ్మపాల : మామిడిపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో కలాం జయంతి జరిపారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులంతా ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి గొంది చినబ్బాయి మాట్లాడుతూ కలాం పేదస్థితి నుంచి ఉన్నత స్థితికి ఎదిగిన గొప్ప వ్యక్తిగా పేర్కొన్నారు. విద్యార్థులంతా ఆయనను ఆదర్శంగా తీసుకోవాలన్నారు. పాఠశాల హెచ్‌ఎం శ్రీధర్, ఉపాధ్యాయులు వసంతరావు, అనిరోజ్, లక్ష్మి, విజయలక్ష్మి, శైలజా, సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.



మామిడిపాలెంలో...

కాఫీ కార్మికుల సమస్యలు పరిష్కరించకుంటే సమ్మె



అధికారులకు సమ్మె నోటీసు ఇస్తున్న కాఫీ కార్మిక సంఘం నాయకులు

చింతపల్లి, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): కాఫీ కార్మికుల సమస్యలు పరిష్కరించకుంటే సమ్మె చేపడతామని కాఫీ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షురాలు ఎస్. కనకవల్లి హెచ్చరించారు. మంగళవారం స్థానిక రాష్ట్ర అటవీ అభివృద్ధి సంస్థ(ఏపీఎఫ్‌డీసీ) చింతపల్లి డివిజనల్ మేనేజర్ కార్యాలయంలో అధికారులకు పది డిమాండ్లతో కూడిన సమ్మె నోటీసు అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కాఫీ కార్మికులకు వేజ్ రేటు ఆధారంగా కూలి, పండ్ల సేకరణ వేతనం పెంచాలన్నారు. కాఫీ కార్మికులకు 26 రోజుల పనిదినాలు కల్పించాలని, హెల్పర్లకు పదోన్నతులు కల్పించాలన్నారు. కార్మికులకు కనీస వేతనంరూ. 26 వేలు చెల్లించాలన్నారు. ప్లాంటేషన్ కండక్టర్ల నియామకం చేపట్టాలన్నారు. సహాయకులకు గుర్తింపు కార్డులు జారీచేసి ఈపీఎఫ్‌సదుపాయం కల్పించాలన్నారు. టీఏ, డీఏతో కూడిన వారంతపు కూలి చెల్లింపులు చేపట్టాలన్నారు. కార్మికుల నివాస గృహాలు మరమ్మతులు చేపట్టి, గ్రూప్ బీమా సదుపాయం కల్పించాలన్నారు. ఈ డిమాండ్లను ఈనెల 31తేదీలోపు పరిష్కరించాలన్నారు. ఈ కార్యక్రమంలో కాఫీ కార్మిక సంఘం గౌరవ అధ్యక్షుడు బోనంగి చిన్నయ్య పడాల్, ప్లాంటేషన్ వర్కర్లు నాగేశ్వరరావు, పాపారావు, రాజారావు, మోరి గిరి, శివ పాల్గొన్నారు.

ఆర్అండ్‌బీ ఏఈఈగా జయరాజు



చింతపల్లి, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): మండలంఆర్అండ్‌బీ ఏఈఈగా వి. జయరాజు నియమితులయ్యారు. తాజా బదిలీల్లో ఇక్కడ పనిచేస్తున్న ఏఈఈ భరతుడు సీలేరు బదిలీకాగా, ఆయన స్థానంలో పార్వతీపురం మన్యం జిల్లా నుంచి జయరాజును ఇక్కడ నియమించారు. ఈమేరకు ఆయన మంగళవారం బాధ్యతలు స్వీకరించారు.

డ్రగ్స్‌కు యువత దూరంగా ఉండాలి: ఎంఈవో

చింతపల్లి, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): యువత డ్రగ్స్‌కి దూరంగా ఉండాలని ఎంఈవో పనసల ప్రసాద్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో విద్యార్థులు, ఉపాధ్యాయులతో కలిసి మనం సేవా సొసైటీ ప్రతినిధులు డ్రగ్స్‌కి వ్యతిరేకంగా అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఈవో మాట్లాడుతూ యువత గంజాయి, మద్యం, ఇతర డ్రగ్స్ జోలికి వెళ్లరాదన్నారు. తాత్కాలిక సంతోషం కోసం విలువైన జీవితాలను నాశనం చేసుకుంటున్నారన్నారు. ఈకార్యక్రమంలో మనం సేవా ట్రస్టు వ్యవస్థాపకుడు గౌతం నరేంద్ర మహర్షి, జెడ్పీస్కూల్ హెచ్ఎం అప్పారావు పాల్గొన్నారు.

భారీ వర్షం



ధారకొండలో వర్షం

సీలేరు, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి), జీకే వీధి మండలం సీలేరు, ధారకొండ, దుప్పులవాడ పంచాయతీల్లో మంగళవారం రాత్రి ఉరుములతో కూడిన భారీ వర్షం కురిసింది. ఉదయం నుంచి ఎండ అధికంగా ఉంది. బంగాళాఖాతంలో నెలకొన్న అల్పపీడనం ప్రభావంతో సాయంత్రం భారీ వర్షం కురిసింది. తుఫాన్ నేపథ్యంలో ఈ ప్రాంతంలో మళ్లీ ఎటువంటి ముప్పు వాటిల్లు తుందోనని గిరిజనులు ఆందోళనకు గురవుతున్నారు. ధారకొండ, గుమ్మిరేవుల, దుప్పులవాడ పంచాయతీల్లో గత నెల 8న కురిసిన భారీ వర్షానికి కొట్టుకుపోయిన కల్వర్టులు, అప్రోచ్‌లు తాత్కాలికంగా పునరుద్ధరించారు. తిరిగి వర్షాలు ప్రారంభం కావడంతో రాకపోకలకు ఇబ్బందులు తలెత్తుతాయోమోనని భయాన్ని వ్యక్తంచేస్తున్నారు.

కుటుంబ సభ్యులకు ఆదివాసీ మహిళ అప్పగింత

విశాఖపట్నం, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): విశాఖపట్నం టీఎస్సార్ కాంప్లెక్స్‌లోని ఏయూటీడీ నిరాశ్రయుల వసతిగృహంలో ఆశ్రయం పొందుతున్న ముంచంగిపుట్టు మండలానికి చెందిన ఓ ఆదివాసీ మహిళను కుటుంబ సభ్యులకు అప్పగించినట్టు ఏయూటీడీ కార్యదర్శి ప్రగడ వాసు తెలిపారు. ఆమె పాడేరు నుంచి విశాఖ వచ్చి రైల్వేస్టేషన్‌లో దిక్కుతోచని స్థితిలో ఉండడంతో ఏయూటీడీ సిబ్బంది ఆరా తీసి టీఎస్సార్ కాంప్లెక్స్‌లోని నిరాశ్రయుల వసతిగృహంలో ఆశ్రయం కల్పించినట్టు చెప్పారు. రెండుసార్లు వసతి గృహం నుంచి ఆమె పారిపోయిందని, రెండో పట్టణ పోలీసులు తీసుకొచ్చి తమ సిబ్బందికి అప్పజెప్పారని పేర్కొన్నారు. పాడేరులో పనిచేస్తున్న ఆదివాసి మిత్ర సంస్థ డైరెక్టర్ మన్మధరావును ఒడియాలో ఆమెతో మాట్లాడించి పూర్తి వివరాలు తెలుసుకున్నామన్నారు. భర్త వేరే వివాహం చేసుకోవడంతో గొడవ పడి అయిదేళ్ల కుమార్తెను తల్లిదండ్రుల వద్ద వదిలేసి విశాఖ వచ్చిందని తెలిపారు. చివరికి ఆమెను కారులో పాడేరు తీసుకెళ్లి ఆ గ్రామ నాయకులకు అప్పగించామన్నారు.



పిల్లర్లతో నిచిన పశువుల షెడ్డు



శిథిలావస్థలో మందులు తదితర వస్తువులు నిల్వకోసం నిర్మించిన షెడ్డు

అటకెక్కిన.. పశు వసతి గృహ నిర్మాణం

- రాష్ట్రంలోనే ప్రయోగాత్మకంగా నడింపాలెం పంచాయతీ నల్లగొండకు మంజూరు
- పాడి రైతుల ఆర్థికాభివృద్ధి లక్ష్యం.. పదేళ్లుగా అందుబాటులోకి రాని వైనం
- కూటమి ప్రభుత్వం రాకతో చిగురిస్తున్న ఆశలు



అరకొర వసతులతో కొనసాగుతున్న పశు వసతి గృహం

కొయ్యూరు, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): మండలంలో నడింపాలెం పంచాయతీ నల్లగొండలో పశువసతి గృహ నిర్మాణం అసంపూర్తిగా మిగిలిపోయింది. గతంలో తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో 2015లో దీనిని ప్రయోగాత్మకంగా మంజూరు చేశారు. తర్వాత అధికారంలోకి వచ్చిన వైసీపీ పట్టించుకోలేదు. ప్రస్తుత కూటమి ప్రభుత్వంలోనైనా ఈ వసతి గృహానికి మంచి రోజులు వస్తాయనే ఆశతో రైతులు ఎదురు చూస్తున్నారు. 2015-16లో తొలి పశు వసతి గృహం నల్లగొండ గ్రామంలో కాగా, రెండోది కర్నూలు జిల్లా బనగానపల్లిలో మంజూరు చేశారు. బనగానపల్లిలో ఎప్పుడో నిర్మాణం పూర్తయి రైతాంగ పశు పోషణకు వీలుగా అన్ని వసతులు కల్పనతో వసతి గృహం కొనసాగుతుండగా నల్లగొండలోనిది మాత్రం అసంపూర్తి భవనాలతో దర్శనమిస్తోంది. రైతుల ఆర్థికాభివృద్ధికి వీలుగా పాడి పరిశ్రమను ప్రోత్సహించేందుకు స్థానిక రైతుల గేదెలు, ఆవులు పోషణ భారం కాకుండా ఉండేందుకు వీలుగా ఈపశు వసతి గృహం ప్రధాన ఉద్దేశం.నల్లగొండలో అప్పట్లో రూ. 1.50 కోట్ల మేర నిధులు మంజూరయ్యాయి. ఇందులో 50 శాతం ఎన్ఆర్ఈజీఎస్ నుంచి మిగిలిన 50 శాతం ఎస్‌డీపీ నిధులు కేటాయిస్తూ ప్రభుత్వం మంజూరు చేసింది. ఈ నిధులతో నిర్మాణాలు చేపట్టేందుకు సాంకేతిక పరమైన ఇబ్బందులు తలెత్తటంతో జాప్యం జరిగినా అప్పటి ఐటీడీఏ పీవో చొరవతో నిర్మాణాలు ప్రారంభించారు. కాంట్రాక్టరు రెండు షెడ్లు, బోరు, విద్యుతు సౌకర్యం కల్పించారు. మరొక షెడ్డు పిల్లర్ల, మరొకటి పునాదులతో పనులు నిలిచాయి. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో బిల్లులు చెల్లింపులు జరపకపోవటంతో నిర్మాణ వ్యయం పెరగటంతో నిర్మాణాలను మధ్యలోనే వదిలేశారు. ఈ పశు వసతి గృహ ఆధారితంగా ఆర్థికాభివృద్ధి చెందాలన్న రైతులు ఆశలు ఆవిరయ్యాయి. అయినా, రైతులకు వేరే గత్యంతరం లేక ఇక్కడి రెండు షెడ్లు వినియోగించుకుంటూ సుమారు 50 గేదెలు మరో 40 ఆవులను పెంపకం చేపడుతూ, కుకుటుంబ పోషణ చేసుకుంటున్నారు. ప్రస్తుతం తిరిగి కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావటంతో గతంలో తెలుగుదేశం ప్రభుత్వ హయాంలోనే మంజూరైన ఈ పశువుల వసతి గృహానికి నిధులు కేటాయించి పూర్తి చేయించేలా చర్యలు తీసుకోవాలని రైతాంగం కోరుతున్నారు.

కూటమి పాలనలో గిరిజన గ్రామాల అభివృద్ధి

- టీడీపీ పాడేరు నియోజకవర్గ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే గిడ్డి ఈశ్వరి
- వాడవాడలా పల్లె పండుగ



కావురాయిలో చేపట్టిన పల్లె పండుగలో గిడ్డి ఈశ్వరి, నాయకులు

పాడేరురూరల్, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న పల్లె పండుగ కార్యక్రమం గిరిజన గ్రామాల అభివృద్ధికి ఎంతగానో దోహదపడతాయని టీడీపీ పాడేరు నియోజకవర్గ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే గిడ్డి ఈశ్వరి, ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి బొర్రా నాగరాజు అన్నారు. మండలంలోని గబ్బంగి పంచాయతీ కేంద్రంలో, గుత్తులపుట్టు పంచాయతీ దబ్బాపుట్టు గ్రామంలో, జి.ముంచంగిపుట్టు పంచాయతీ కావురాయి, చింతలవీధి పంచాయతీ కుమ్మరిపుట్టు, పాడేరు పంచాయతీ గొందూరు గ్రామాల్లో సర్పంచ్‌ల ఆధ్వర్యంలో ఘనంగా పల్లె పండుగను ఘనంగా నిర్వహించామన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, గత జగన్ ప్రభుత్వం గ్రామ పంచాయతీలను నిర్వీర్యం చేసిందన్నారు. కూటమి పాలనలో పంచాయతీల్లో అభివృద్ధి కార్యక్రమాలను చేసుకోగలుగుతున్నామన్నారు. గబ్బంగిలో రూ. 1.20 లక్షలతో ఊటకుంట , దబ్బాపుట్టులో రూ. 8 లక్షలతో మట్టిరోడ్డు, కావురాయిలో రూ. 5 లక్షలతో సీసీ రోడ్డు, కుమ్మరిపుట్టులో రూ. 50 వేలతో రూఫ్ వాటర్, గొందూరులో రూ. 50 వేలతో తాగునీటి సౌకర్యం కల్పనకు శంకుస్థాపనలు చేశామన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ ఎస్.రత్నకుమారి, మాజీ ఎంపీపీ ఎస్‌వీ.రమణమూర్తి, నాయకులు డప్పోడి వెంకటరమణ, బుక్కా జగదీష్, గుత్తులపుట్టు పంచాయతీ సర్పంచ్ బాబూరావుపడాల్, రేగం కొండబాబు, జనసేన పార్టీ మండలాధ్యక్షుడు ఎస్.మురళీకృష్ణ పాల్గొన్నారు.

సంక్రాంతి నాటికి మౌలిక సదుపాయాలు

పెదబయలు: సంక్రాంతి నాటికి గ్రామాల్లో మౌలిక సదుపాయాలు కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని ఉపాధి హామీ పథకం ఏపీవో నాయుడు పేర్కొన్నారు. మండలంలోని సీతగుంట, సీకరి, లక్ష్మీపేట, అడుగులపుట్టు, అరడకోట పంచాయతీ కేంద్రాల్లో ట్రెంచ్ వర్క్, వాన నీటి సంరక్షణ పనులకు మంగళవారం ప్రజాప్రతినిధులు, అధికారుల సమక్షంలో భూమి పూజ చేశారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ రాజుబాబు, సర్పంచ్‌లు మాధవరావు, క్రిష్టరావు, అశోక్, ఎంపిటీసీ సభ్యులు బొంజుబాబు, ఆనందరావు తదితరులు పాల్గొన్నారు.

అనంతగిరి మండలంలో..

అనంతగిరి: గ్రామాల అభివృద్ధే ధ్యేయమని టీడీపీ మండల అధ్యక్షుడు అంటిపర్తి బుజ్జిబాబు అన్నారు. మండలంలోని కొత్తూరు పంచాయతీ కేంద్రంలోని మంగళవారం పల్లెపండుగ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా రూ.33 లక్షల డ్రైనేజీ, తదితర పనులకు శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలోని జడ్పీ మాజీ ఛైర్మన్ అప్పారావు, సర్పంచ్ సీతయ్య, వైస్ సర్పంచ్ జి.నరేంద్ర, నాయకులు టి.ఆనందరావు, ఎం. జోగులు, దొన్ను, నాగేశ్వరరావు, ఏఈ గౌతమ్, కార్యదర్శి వరలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

చింతపల్లి: గ్రామాల అభివృద్ధికి ప్రత్యేక కార్యాచరణ అమలు చేస్తున్నామని స్థానిక ఎంపీడీవో పి. ఆశాజ్యోతి అన్నారు. మంగళవారం మండలంలోని చౌడపల్లి, అంతర్ల, చింతపల్లిలో పల్లె పండుగ నిర్వహించారు. పలు అభివృద్ధి పనులకు ఎంపీపీ కోరాబు అనుషతో పాటు కూటమి నాయకులు భూమి పూజ చేసి పనులు ప్రారంభించారు. మండల కేంద్రం సంపద కేంద్రంలో చేతి పంపు నిర్మించనున్నట్టు ఎంపీడీవో తెలిపారు. ఈకార్యక్రమంలో ఈవోఆర్‌డీ శ్రీనివాసరావు, ఏపీవో కొక్కుల లక్ష్మీనారాయణ మూర్తి, సర్పంచ్ దురియా పుష్పలత, ఎంపీటీసీ సభ్యురాలు జయలక్ష్మి, టీడీపీ మండలాధ్యక్షుడు కిల్లో పూర్ణచంద్రరావు, కూటమి నాయకులు రీమల ఆనందరావు, నాగ భూషణం, బుజ్జిబాబు పాల్గొన్నారు.

జీకే వీధి మండలంలో..

సీలేరు: జీకేవీధి మండలం ధారకొండ పంచాయతీ చెక్కలమద్ది గ్రామంలో సర్పంచ్ నడిగట్ల రాజు ఉపాధి పనులను ప్రారంభించారు. ట్రై కట్ ట్రెంచ్‌లు (కందకాలు)రూ. 7 లక్షలతో నిర్మించనున్నట్టు ఆయన తెలిపారు. దుప్పులవాడ పంచాయతీ ఎస్. నేరేడుపల్లిలో రూ. 4 లక్షల విలువ చేసే చెరువు పనులను సర్పంచ్ కుమారి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యులు మాడి రామన్న, కార్యదర్శి రాజ్యలక్ష్మి, వార్డు సభ్యులు కిల్లో మహలక్ష్మి, మోహనబాబు, పిల్లా బుజ్జి, టెక్నికల్ అసిస్టెంట్ రామూర్తి, ఉపాధి హామీ సిబ్బంది శ్రీనివాస్, కూటమి నాయకులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు శంకుస్థాపన

అరకులోయ: మండలంలోని సుంకరమెట్ట పంచాయతీ సర్పంచ్ చినబాబు అధ్యక్షణ దండబాడు గ్రామంలో జరిగిన పల్లెపండుగ కార్యక్రమంలో టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి దొన్నుదొర, అధికారులు పాల్గొన్నారు. రూ.90 లక్షలతో చేపట్టనున్న దండబాడు నుంచి లింబగుడ గ్రామం వరకు డబ్ల్యూబీఎం రోడ్డు నిర్మాణానికి భూమిపూజ నిర్వహించారు. బొండాం పంచాయతీలో పలు అభివృద్ధి పనులకు సర్పంచ్ భాస్కరరావు ఆధ్వర్యంలో అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. దొన్నుదొర,పార్టీ నేతలు పాల్గొన్నారు.

డుంబ్రిగుడ: మారుమూల గిరిజన గ్రామాల అభివృద్ధికి కూటమి ప్రభుత్వం శ్రీకారం చుట్టినట్టు టీడీపీ మండల అధ్యక్షుడు సుబ్బారావు అన్నారు. మండలంలోని కోర్రా, కించుమండ, కితలంగి పంచాయతీ కేంద్రాల్లో నిర్వహించిన పల్లె పండుగలో ఆయన మాట్లాడారు. సంఘంవలస గ్రామంలో గిరిజన రైతులకు గోశాల, మేకల షెడ, నిర్మాణానికి భూమిపూజలు చేశారు. ఈ కార్యక్రమంలో అధి కారులు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ప్రకృతి ఒడిలో..

- అరకులోయలో పర్యాటకుల సందడి
- బెంగాల్ నుంచి భారీగా రాక



సుంకరమెట్ట కాఫీ తోటల మధ్య పర్యాటకులు

అరకులోయ, అక్టోబరు 15, ఆంధ్రజ్యోతి: పర్యాటక సీజన్ ప్రారంభం కావడంతో ఆంధ్రా ఊటీ అరకులోయకు వివిధ రాష్ట్రాలనుంచి సందర్శకులు కుటుంబ సమేతంగా విచ్చేస్తున్నారు. తెలుగు రాష్ట్రాల్లో దసరాసెలవులు పూర్తికావడంతో బెంగాల్‌నుంచి పర్యాటకులు పెద్ద సంఖ్యలో సందర్శిస్తున్నారు. మంగళవారం ఘాట్‌రోడ్, అనంతగిరి కాఫీతోటలు, గాలికొండవ్యూపాయింట్ , సుంకరమెట్ట కాఫీ తోటలు దారిపొడవునా సందర్శనీయ స్థలాలు కిటకిటలాడాయి. చీకులు, స్వీట్‌కార్న్ తింటూ ఆనందంగా గడిపారు. సుంకరమెట్ట కాఫీ తోటలు వద్ద జంటలకు సంబంధించి ఫొటోషూట్‌లతో సందడిగా కనిపించారు. సాయంత్రం పర్యాటకులు బొర్రాగుహలను సందర్శించారు. కటికి, తాడిగుడ జలపాతాల దారిలో ఉన్న బీసుపురం, సుంకరమెట్ట కాఫీతోటలు, సినిమా షూటింగ్ పాయింట్స్‌ను సందర్శిస్తూ అరకులోయకు చేరుకుంటున్నారు. అరకులోయలో మ్యూజియం, పద్మాపురం గార్డెన్‌ను సందర్శించారు. అరకులోయలో రిసార్టులు, లాడ్జిలలో బసచేసిన పర్యాటకులు తెల్లవారుజామున పొగమంచు అందాలను తిలకించారు. "మాడగడ సన్‌రైజ్‌పాయింట్‌కు ఎదురుగా ఉన్న బల్లుగుడ పంటపొలాల వద్ద పాలసముద్రంలా ఉన్న చోట్ల సెల్ఫీలు దిగారు. థింసా కళాకారులతో నృత్యం చేశారు.

విలువలతో కూడిన బోధన అందించాలి: ఆర్‌జేడీ



అరకులోయ పాఠశాలలో ఉపాధ్యాయులతో మాట్లాడుతున్న ఆర్‌జెడి ఉదయ్‌భాస్కర్

అరకులోయ, అక్టోబరు 15, (ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు విలువలతో కూడిన విద్యా బోధన అందించాలని పాఠశాల విద్యా శాఖ ఆర్‌జేడీ ఉదయ భాస్కర్ ఉపాధ్యాయులకు సూచించారు. మంగళవారం అరకులోయ ప్రభుత్వ ఉన్నత పాఠశాలను సందర్శించారు. విద్యాబోధన తీరు, సిలబస్ పూర్తయిన వివరాలన హెచ్ఎం మోహన్ ఆర్‌జేడీకి వివరించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులతో సమావేశమయ్యారు. క్రమశిక్షణతో పాటు విలువలతో విద్యార్థులను తీర్చి దిద్దే బాధ్యత ఉపాధ్యాయులదేనన్నారు. ఉపాధ్యాయులు సమయ పాలన పాటించారు. సకాలంలో సిలబస్‌పూర్తి చేసి, రివిజన్‌లు చేపట్టాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో వంతల త్రినాధరావు, సీఆర్‌టీలు పాల్గొన్నారు.

విద్యతోపాటు ఆధ్యాత్మిక వికాసం అవసరం



సమావేశంలో బాల వికాస కేంద్రాల ఆచార్య, మాతాజీలు

పాడేరు రూరల్, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): బాల వికాస కేంద్రాల్లో చిన్నారులకు విద్యతోపాటు ఆధ్యాత్మిక వికాసం కలిగేలా బోధించాలని ఆధ్యాత్మిక సేవా సంఘం ఛైర్మన్, ఉమా నీకంఠేశ్వస్వామి ఆలయ ధర్మకర్త కొట్టగుళ్లి సింహాచలం నాయుడు అన్నారు. సమరసత సేవా ఫౌండేషన్ ఆధ్వర్యంలో నడుపుతున్న బాల వికాస కేంద్రాల్లో పనిచేస్తున్న ఆచార్య, మాతాజీలకు ఆలయ ప్రాంగణంలో మంగళవారం నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో పాల్గొన్న ఆయన మాట్లాడారు. ఈ కార్యక్రమంలో పాడేరు డివిజన్‌లోని 11 మండలాల వికాస కేంద్రాల ఆచార్య, మాతాజీలు, ఆధ్యాత్మిక సేవా సంఘం ప్రధాన కార్యదర్శి ఉప్పల వెంకటరత్నం, న్యాయవాది టి.ప్రసాద్ నాయుడు, జిల్లా ధర్మప్రచారక్ పంపా సహదేవ్, మండల కన్వీనర్ వంతాల మోహన్‌రావు, ధర్మప్రచారక్ సుబ్బారావు పాల్గొన్నారు.

విద్యార్థి దశలోనే అభ్యాస వైకల్యాలపై అవగాహన కల్పించాలి

విద్యార్థుల్లో అభ్యాస లోపాలను గుర్తించి బోధన సాగించాలని ఎంఈవో ఎస్.విశ్వప్రసాద్ ఉపాధ్యాయులకు సూచించారు. పాడేరులో డిస్లెక్సియా వాక్ తాన్‌పై మంగళవారం ప్రభుత్వ ఉన్నత పాఠశాలల విద్యార్థులు నిర్వహించిన అవగాహన ర్యాలీలో పాల్గొని మాట్లాడారు. ఈ కార్యక్రమంలో సమగ్ర శిక్ష జిల్లా సహిత కో- ఆర్డినేటర్ కె.భాస్కరరావు, పాఠశాల ఉపాధ్యాయులు, స్పెషల్ ఎడ్యుకేటర్స్, పిల్లల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

మారుమూల గ్రామాల అభివృద్ధే లక్ష్యం


- అల్లూరి జిల్లా ఎస్పీ అమిత్ బర్దార్



జామిగూడ గ్రామస్తుల సమస్యలను అడిగి తెలుసుకుంటున్న అమిత్ బర్దార్

పెదబయలు, అక్టోబర్ 15 (ఆంధ్రజ్యోతి): మారుమూల ప్రాంతాల అభివృద్ధే తమ లక్ష్యమని అల్లూరి జిల్లా ఎస్పీ అమిత్ బర్దార్ అన్నారు. మంగళవారం ఆయన ఆంధ్ర-ఒడిశా సరిహద్దు జామిగూడ పంచాయతీ కేంద్రంలో ఆకస్మికంగా పర్యటించారు. అక్కడి గిరిజనులతో మాట్లాడి గ్రామంలో సమస్యలను అడిగి తెలుసుకున్నారు. గ్రామాల్లో గంజాయి పంటను వీడి సాంప్రదాయ పంటలను సాగు చేసుకోవాలని ఈ సందర్భంగా సూచించారు. గంజాయి వల్ల అనేక కుటుంబాలు ఛిద్రం అవుతున్నాయన్నారు. గంజాయికి యువత బానిసై భవిష్యత్తును నాశనం చేసుకోవద్దని హితవు పలికారు. గంజాయిని సాగు, రవాణా చేస్తే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. ఇటీవల గంజాయి రవాణా లో పట్టుబడిన పెదబయలు మండలానికి చెందిన ఓ యువకుడికి 21 ఏళ్ల జైలు శిక్ష పడినట్టు ఆయన గుర్తు చేశారు. గంజాయి వ్యాపారులు గ్రామాలకు వస్తే సమాచారం అందించాలన్నారు. అనంతరం జామిగూడలోని ప్రాథమిక పాఠశాలను సందర్శించి విద్యార్థులతో ఆయన ముచ్చటించారు. వారితో పద్యాలు పాడించి అభినందించారు. తిరుగు ప్రయాణంలో రూడకోట ఆవుట్‌పోస్టును సందర్శించారు. సీఆర్పీఎఫ్ బెటాలియన్ విధులపై ఆరా తీశారు. వాహన తనిఖీలు ముమ్మరం చేయాలన్నారు. గంజాయి సాగును గుర్తించేందుకు రూడకోట పరిసర ప్రాంతాల్లో ఏర్పాటుచేసిన డ్రోన్ కెమెరా ద్వారా పరిశీలించారు.

అబ్దుల్ కలాం స్ఫూర్తితో ఉన్నత శిఖరాలను అధిరోహించాలి



మాజీ రాష్ట్రపతి అబ్దుల్ కలాం చిత్రపటానికి నివాళులర్పిస్తున్న బీజేపీ నాయకులు

పాడేరురూరల్, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): మాజీ రాష్ట్రపతి డాక్టర్. ఏపీజే అబ్దుల్ కలాంను ఆదర్శంగా తీసుకొని గిరిజన ప్రాంత విద్యార్థులు ఉన్నత శిఖరాలను అధిరోహించాలని బీజేపీ మైనారిటీ మోర్చా రాష్ట్ర కార్యదర్శి పెనుమాక రవికుమార్ కోరారు. అబ్దుల్ కలాం 93వ జయంతి వేడుకలు బీజేపీ జిల్లా కార్యాలయంలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. ముందుగా కలాం చిత్రపటానికి నివాళులు అర్పించారు. అనంతరం మండలంలోని బూరుగుపుట్టు, గడివలస గ్రామాల్లోని ప్రాథమిక పాఠశాలల విద్యార్థులకు పెన్నులు, నోట్‌బుక్‌లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు పాంగి రాజారావుగిరిజన మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు కురసా ఉమామహేశ్వరరావు, ట్రైకార్ బోర్డు డైరెక్టర్ కూడా కృష్ణారావు, నాయకులు కుడుముల వెంకటరమణ, లకే అబ్బాయిదొర, సల్లా రామకృష్ణ, రాఘవేంద్రరావు, ఎస్.వేమనబాబు, పి.పాపిటిరాజు, ఎం.గోపాలపాత్రుడు, పి.ఈశ్వరరావు, ఉపాధ్యాయులు బాకూరు రాజేశ్వరి, కొండబాబు పాల్గొన్నారు.

కలాం సేవలు చిరస్మరణీయం

చింతపల్లి: మాజీ రాష్ట్రపతి, శాస్త్రవేత్త ఏపీజే అబ్దుల్ కలామ్ ఆదర్శనీయులని వర్తకసంఘం ప్రధాన కార్యదర్శి పెదిరెడ్ల బేతాళుడు అన్నారు. మంగళవారం కలామ్ జయంతినిపురస్కరించుకుని ఆయన చిత్రపటానికి పూలమాలవేసి నివాళి అర్పించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రపతి, శాస్త్రవేత్తగా దేశానికి ఉత్తమ సేవలందించిన వ్యక్తి కలామ్ అన్నారు. యువత, విద్యార్థులు ఆయన జీవిత చరిత్రను తెలుసుకుని ఉన్నత లక్ష్యాలను సాధించాలన్నారు. ఈ కార్యక్రమంలో చేయూత వారియర్స్ ట్రస్టు ఛైర్మన్ దూనబోయిన రమణ, ఇమ్మది మోదగిరి, సాగిన జగన్ పాల్గొన్నారు.

పంచాయతీల పాలనపై అవగాహన తప్పనిసరి

గూడెంకొత్తవీధి, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): పంచాయతీ పరిపాలనపై వార్డు సభ్యులకు అవగాహన కలిగి ఉండాలని స్థానిక ఎంపీడీవో వై. ఉమామహేశ్వరరావు తెలిపారు. మంగళవారం మండల పరిషత్ సమావేశమందిరంలో ఒక్కో పంచాయతీ నుంచి ఇద్దరు వార్డు సభ్యులు, ఉప సర్పంచ్‌కి పంచాయతీరాజ్ చట్టం 1994పై శిక్షణ కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ పంచాయతీ పరిధిలో జరిగే అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు సర్పంచ్, వార్డు సభ్యుల ఆమోదంతోనే జరగాల్సి ఉందన్నారు. పంచాయతీకి విడుదలయ్యే నిధులు, ఖర్చులపై ప్రతి సభ్యునికి గ్రామ సభలో తెలుపుతామన్నారు. పంచాయతీల్లో చేపట్టే అభివృద్ధిలో వార్డు సభ్యుల భాగస్వామ్యం ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో ఈవోఆర్‌డీ పాపారావు, ఎంవోటీ అరుణ్ కుమార్ పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధిలో వార్డు మెంబర్లు కీలకం

అనంతగిరి: గ్రామ పంచాయతీ అధికారాలపై అవగాహన కలిగి ఉండాలని ఎంపీపీ శెట్టి నీలవేణి అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలోని వద్ద 12 పంచాయతీల ఉప సర్పంచ్లు, వార్డు మెంబర్లకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. పంచాయతీ అభివృద్ధిలో ఉపసర్పంచ్‌లు, వార్డులు మెంబర్లు కీలకమని అన్నారు. గ్రామాల్లో పారిశుధ్య, అభివృద్ధి తదితర అంశాలపై ఈవోపీఆర్డీ లాలం సీతయ్య, వివరించారు.

ప్రకృతి వ్యవసాయంతో అధిక దిగుబడి: ఏవో

ముంచంగిపుట్టు, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): ప్రకృతి వ్యవసాయ పద్ధతులతో పంట దిగుబడి ఎక్కువగా వస్తుందని ఏవో శ్రీనివాస బాబు అన్నారు. మండలంలోని దోడిపుట్టు, పెదగూడ పంచాయతీలలో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఏవో రైతులతో మాట్లాడుతూ కూరగాయల పంటల్లో కాయ తొలుచు పురుగు నివారణకు పంట శానిటేషన్ చేయాలని, రసం పీల్చు పురుగుల నివారణకు పసుపు, నీలి రంగు జిగురు అట్టలు, ఎర పంటలుగా బంది, ఆవాలు వేసుకోవాలని సూచించారు. ప్రధానంగా నాణ్యమైన విత్తనాలు ఎంచుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ప్రజా ప్రతినిధులు, రైతులు పాల్గొన్నారు.

రైతులు ఆర్థికంగా ఎదగాలి

అనంతగిరి: రైతులు అధికదిగుబడులు సాధించి ఆర్థికంగా ఎదగాలని ఏవో ఉమామహేశ్వరి అన్నారు. మండలంలోని టోకూరు పంచాయతీ పొలం పిలుస్తుంది కార్యక్రమం సర్పంచ్ కిల్లో మోస్య ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ దొన్ను, టీడీపీ నాయకులు కిముడు కళారాజు, చిన్నయ్య అగ్రికల్చర్ అసిస్టెంట్ ఉషా, తదితరులు పాల్గొన్నారు.

శాస్త్రీయ పద్ధతి సాగుతో అధిక దిగుబడులు

గూడెంకొత్తవీధి: ఆదివాసీ రైతులు సాగులో శాస్త్రీయ పద్ధతులు పాటిస్తే నాణ్యమైన అధిక దిగుబడులు సాధించవచ్చునని ఏవో మధుసూదనరావు అన్నారు. మంగళవారం కొత్తగూడెంలో నిర్వహించిన పొలం పిలుస్తోందిలో ఆయన మాట్లాడారు.

కనుల విందుగా జాంకారమ్మ జాతర



సింగర్బ గ్రామంలో జాంకారమ్మ జాతరలో పాల్గొన్న భక్తులు

జి.మాడుగుల, అక్టోబరు (ఆంధ్రజ్యోతి):మండలంలోని సింగర్బ పంచాయతీ కేంద్రంలో మంగళవారం జాంకారమ్మ జాతర కనుల విందుగా సాగింది పూజరులు కుమ్మరి పెద్దబ్బాయి, వండ్లాబు గణేశ్‌నాయుడు ఆధ్వర్యంలో జరిగిన ఈ జాతరకు పరిసర గ్రామాలభక్తులు పాల్గొన్నారు.ఈసందర్భంగా సంప్రదాయ నృత్యాలు అలరించాయి.

అన్న సమారాధన

సీలేరు: జీకేవీధి మండలం సీలేరు మార్కెట్ సెంటర్‌లో శరన్నవరాత్రి మహోత్సవాలు పురస్కరించుకుని మంగళవారం అమ్మవారి సన్నిధిలో ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో అన్నసమారాధన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఏపీ జెన్‌కో సీలేరు కాంప్లెక్సు ఎస్ఈ రామభద్రరాజు, ఈఈ శ్రీనివాసరెడ్డి, సీఆర్‌పీఎఫ్ ఇన్‌స్పెక్టర్ వికాష్ పాండే అమ్మవారికి ప్రత్యేక పూజా కార్యక్రమాలను నిర్మించిన తర్వాత అన్నదానం ప్రారంభించారు. సీలేరు పరిసర ప్రజలు పాల్గొన్నారు.



స్పీకర్ అయ్యన్నపాత్రుడును సత్కరిస్తున్న తాతయ్యబాబు

స్పీకర్ అయ్యన్నను కలిసిన తాతయ్యబాబు

నర్సీపట్నం, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): స్పీకర్ అయ్యన్నపాత్రుడును రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ ఛైర్మన్ తాతయ్యబాబు మంగళవారం మర్యాదపూర్వంగా కలిశారు. ఈ సందర్భంగా రాష్ట్రంలో గృహనిర్మాణ పథకాల పురోగతిపై చర్చించారు. హౌసింగ్ కార్పొరేషన్ ద్వారా చేయబోయే పనులు వివరాలను స్పీకర్ అడిగి తెలుసుకున్నారు. రానున్న రోజుల్లో పేద ప్రజల కోసం మరిన్ని అభివృద్ధి కార్యక్రమాలు అందుబాటులోకి రానున్నాయని తెలిపారు.

సొసైటీ సైంటిస్ట్ పుస్తకావిష్కరణ



సొసైటీ సైంటిస్ట్ పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న తాతయ్యబాబు

బుచ్చెయ్యపేట, అక్టోబరు 15: కలవలపల్లి శ్రీనివాస్ రచించిన సొసైటీ సైంటిస్ట్ పుస్తకాన్ని రాష్ట్ర గృహనిర్మాణ కార్పొరేషన్ ఛైర్మన్, టీడీపీ జిల్లా అధ్యక్షుడు బత్తుల తాతయ్యబాబు వడ్డాదిలో మంగళవారం ఆవిష్కరించారు. సరికొత్త తత్వశాస్త్రాన్ని రచించిన శ్రీనివాస్‌కు తాతయ్యబాబు నగదు ప్రోత్సాహకాన్ని అందించి అభినందించారు. పాఠకులకు ఒక్కో పుస్తకాన్ని రూ.50కు అందిస్తున్నట్టు ఈ సందర్భంగా శ్రీనివాస్ తెలిపారు.

తెగుళ్ల నివారణపై దృష్టిసారించండి

» జిల్లా వ్యవసాయాధికారి మోహనరావు

దేవరాపల్లి/కె.కోటపాడు, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): తెగుళ్ల నివారణపై రైతులు ప్రత్యేక దృష్టిసారించాలని జిల్లా వ్యవసాయాధికారి మోహనరావు సూచించారు. కె.కోటపాడు మండలం వారాడ, దేవరాపల్లి మండలంలోని కొత్తపల్లి గ్రామంలో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వ్యవసాయ, అనుబంధ శాఖల ద్వారా అమలవుతున్న పథకాలు, యాజమాన్య పద్ధతులను తెలుసుకోవాలని రైతులకు సూచించారు. అలాగే పంటలను పురుగులు, తెగుళ్ల నుంచి రక్షించుకోవాలంటే గట్టు మీద ఎర పంటలను వేసుకోవాలని చెప్పారు. ఏపీ ఎంఐపీ జిల్లా అధికారి జీవీ.లక్ష్మి మాట్లాడుతూ రాయితీపై ఇస్తున్న పరికరాలను రైతులు పొందాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏవో సోమశేఖర్, కొరువాడ పశు వైద్యాధికారి ఎర్రినాయుడు, ఏఈవో లైలా, వీఏఏ పూజిత పాల్గొన్నారు.

ఆరోగ్య పరిరక్షణలో ప్రజాప్రతినిధులు కీలకం



మాట్లాడుతున్న ఎంపీడీవో ఆంజనేయులు

చోడవరం, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): ప్రజారోగ్య పరిరక్షణలో ప్రజాప్రతినిధులదే కీలకపాత్ర అని ఎంపీడీవో పి.ఆంజనేయులు చెప్పారు. మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో ఆర్‌జీపీ ఎస్ఏ కార్యాచరణ ప్రణాళికపై మంగళవారం ఉప సర్పంచులు, వార్డు సభ్యులకు శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పారిశుధ్యం మెరుగ్గా ఉంటే ప్రజల ఆరోగ్యం బాగుంటుందన్నారు. ఘన వ్యర్థ పదార్థాల నిర్వహణ కార్యక్రమాలు సక్రమంగా అమలయ్యేలా చూడాలని కోరారు. ఈవోపీఆర్‌డీ మహేష్ మాట్లాడుతూ పంచాయతీ సభ్యుల విధులు, అధికారాలను వివరించారు. వరుసగా మూడు సమావేశాలకు హాజరుకాని సభ్యుల అధికారం రద్దయ్యే ప్రమాదం ఉందని చెప్పారు. ఈ సందర్భంగా పంచాయతీరాజ్ చట్టం 1994 నిబంధనలు వివరించారు. సమావేశంలో ఎంపీపీ గాడి కాసు, వార్డు సభ్యులు పాల్గొన్నారు.

ఉప సర్పంచులు, వార్డు సభ్యులకు శిక్షణ

మాడుగుల రూరల్, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): మండల పరిషత్ కార్యాలయ సమావేశ ప్రాంగణంలో మంగళవారం పలు గ్రామాల ఉప సర్పంచులు, వార్డు సభ్యులకు శిక్షణఇచ్చారు. పరిపాలన పరమైన అంశాలపై వారికి అధికారులు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ రాజారామ్, ఎంపీడీవో కొంకి అప్పారావు, ఈవోపీఆర్డీ కరుణాకర్ పాల్గొన్నారు.

కాంట్రాక్టు అధ్యాపకుల నిరసన

రావికమతం, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): క్రమబద్ధీకరణ ప్రక్రియను తక్షణమే ప్రారంభించాలని డిమాండ్ చేస్తూ కాంట్రాక్టు అధ్యాపకులు నిరసన తెలిపారు. ఈ మేరకు కొత్తకోట జూనియర్ కళాశాలలో మంగళవారం పసుపు రిబ్బన్లు ధరించి విధులకు హాజరయ్యారు. అనంతరం సంఘం జిల్లా అధ్యక్షుడు రాజేష్ మాట్లాడుతూ తమ న్యాయమైన డిమాండ్లను నెరవేర్చాలని కోరారు. లేనిపక్షంలో పోరాటం ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

ఆరు పంచాయతీలకు కార్యదర్శుల నియామకం

చీడికాడ, అక్టోబరు 15: మండలంలోని ఆరు పంచాయతీలకు నూతన కార్యదర్శులను నియమిస్తూ జడ్పీ సీఈవో ఉత్తర్వులు జారీ చేశారు. జి.కొత్తపల్లికి కె.నాగేశ్వరరావు, భైలపూడికి పట్నాల గోపి, అప్పలరాజుపురానికి ఎం.వీర్రాజు, ఖండివరానికి పీలా పద్మావతి, చీడికాడకు ఎ.సన్యాసిరావు, దండిసురవరం కార్యదర్శిగా చంద్రశేఖరరావు బాధ్యతలు స్వీకరించారు.

పశువులకు నట్టల నివారణ టీకాలు

మాడుగుల రూరల్, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): మండలంలో అన్ని గ్రామాల్లో పశువులకు నట్టల నివారణ టీకాలు వేయనున్నట్టు పశు వైద్య శాఖ సహాయ సంచాలకుడు చిట్టినాయుడు ఒక ప్రకటనలో తెలిపారు. నట్టల నివారణ వల్ల జీవాలలో వ్యాధి నిరోధక శక్తి, బరువు పెరుగుదల రేటు వృద్ధి చెందుతాయని చెప్పారు. గొర్రెలు, మేకల పెంపకందారులు రైతు సేవా కేంద్రాల్లోని పశు వైద్యులు, సహాయకులను సంప్రదించాలని కోరారు.

పల్లె పండగ వారోత్సవాలు జయప్రదం చేయండి

చీడికాడ, అక్టోబరు 15: మండలంలో పల్లె పండగ వారోత్సవాలను కార్యదర్శులు విజయవంతం చేయాలని ఎంపీడీవో వి.హేమసుందర్రావు సూచించారు. మంగళవారం విలేకరులతో ఆయన మాట్లాడుతూ 11 పంచాయతీల్లో సీసీ రోడ్లు, డ్రైనేజీల నిర్మాణాలకు రూ.59 కోట్లు మంజూరయ్యాయన్నారు. ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి వీటిని ప్రారంభిస్తారని, ఈ కార్యక్రమాలను పక్కా ఏర్పాట్లు చేయాలని కార్యదర్శులకు సూచించారు.

సీసీ రోడ్ల నిర్మాణాలకు శంకుస్థాపన

కృష్ణాదేవిపేట, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): గొలుగొండ మండలంలోని పాతకృష్ణాదేవిపేట గ్రామంలో మంగళవారం సీసీ రోడ్ల నిర్మాణాలకు శంకుస్థాపన చేశారు. పల్లె పండగ కార్యక్రమంలో భాగంగా ఎంపీపీ మణికుమారి, ఉప సర్పంచ్ సహదేవుడు, గొలుగొండ జడ్పీటీసీ మాజీ సభ్యుడు చిటికెల తారకవేణుగోపాల్ తదితరులు ఈ కార్యక్రమం చేపట్టారు. జడ్పీటీసీ మాజీ సభ్యుడు వేణుగోపాల్ మాట్లాడుతూ గొలుగొండ మండలంలో సీసీ రోడ్ల నిర్మాణాలకు రూ.2.24 కోట్లు మంజూరు చేశారన్నారు. ఈ కార్యక్రమంలో గొలుగొండ ఎంపీపీ గజ్జలపు మణికుమారి, చోద్యం సర్పంచ్ ఆదపురెడ్డి గోపాలకృష్ణ, ఉప సర్పంచ్ సహదేముడు, జడ్పీటీసీ మాజీ సభ్యుడు చిటికెల తారక వేణుగోపాల్, మాజీ సర్పంచ్ ప్రభాకర్‌రావు, కూటమి నాయకులు ముర్వల బుజ్జి, శివ రమణ, ,నూకరాజు, చిన్ని తదితరులు పాల్గొన్నారు.

'జనసేన నాయకులపై చినచూపు తగదు'

నాతవరం, అక్టోబరు 15: మండల టీడీపీ నాయకులు తమ పట్ల చిన్న చూపు చూడడం తగదని జనసేన మండల యూత్ అధ్యక్షులు భైన మురళి పేర్కొన్నారు. మంగళవారం వైబీ అగ్రహారం గ్రామంలో జనసేన, బీజేపీ నాయకులతో కలసి విలేకరులతో ఆయన మాట్లాడారు. తన సొంత గ్రామంలో రూ.10 లక్షలతో సీసీ రోడ్డు, కాలువల నిర్మాణాలకు శంకుస్థాపన చేయగా, తనకు కనీస సమాచారం ఇవ్వకపోవడం దారుణమన్నారు. స్పీకర్ అయ్యన్నకు చెడ్డపేరు తెచ్చేలా టీడీపీ నాయకులు వ్యవహరిస్తున్నారని ఆరోపించారు.

రహదారిద్ర్యం.. రాకపోకలు నరకం!

రహ'దారి' పొడవునా గతుకులు.. ఎక్కడికక్కడే తేలిపోయిన రాళ్లు.. పలుచోట్ల ఊడిపోయిన పెచ్చులు.. మలుపుల్లో ఏపుగా పెరిగిన తుప్పలు.. ఇవీ దిబ్బపాలెం-దండిసురం ప్రధాన రోడ్డు రూపురేఖలు! వెరసి ఐదు పంచాయతీలకు చెందిన ఎనిమిది గ్రామాల ప్రజలు రాకపోకలు సాగించడానికి ప్రత్యక్ష నరకం చూడాల్సి వస్తోంది.

» దిబ్బపాలెం-దండిసురవరం రోడ్డు శిథిలం

» ఆద్యంతం గతుకలు.. తేలిపోయిన రాళ్లు

» ఎక్కడికక్కడే ఊడిపోయిన తారు పెచ్చులు

» చినుకు పడితే మినీ కుంటలను తలపిస్తున్న వైనం

» ఎనిమిది గ్రామాల ప్రజలకు తప్పని రవాణా పాట్లు

చీడికాడ, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): మండలంలోని దిబ్బపాలెం నుంచి దండిసురవరం వరకు ఆర్‌అండ్‌బీ రోడ్డు అధ్వానంగా తయారైంది. సుమారు 2.5 కిలోమీటర్లు ఉన్న ఈ మార్గంలో ఆదమరచి ప్రయాణాలు సాగిస్తే ప్రమాదాలకు గురికాకతప్పడం లేదు. సుమారు 15 ఏళ్ల క్రితం ఈ మార్గాన్ని తారు రోడ్డుగా నిర్మించారు. ఇందులో భాగంగా మారాజు చెరువువద్ద కాజ్‌వే నిర్మాణం చేపట్టారు. ఐదేళ్ల వరకూ బాగానే ఉన్న ఈ రహదారిలో 2014 నుంచి మరమ్మతుకు గురికావడం మొదలైంది. ప్రస్తుతం పూర్తిస్థాయిలో శిథిలమైంది. రహదారి పలు చోట్ల కోతకు గురైంది. అడుగడుగునా గోతులు ఏర్పడ్డాయి. ఎక్కడికక్కడే తారు పెచ్చులు ఊడిపోయాయి. దీంతో ఈ రహదారి ప్రతి ఏటా తుపాన్‌లు, అకాల వర్షాలకు నీరు చేరిపోయి చెరువుల్లా మారిపోతోంది. ఈ రోడ్డు గ్రామంలో యూపీ స్కూల్‌కి దగ్గరలో ఉన్న ఒక చోట రోడ్డు కోతకి గురికావడంతో పాటు మారాజు చెరువు వద్ద ఉన్న కాజ్‌వే కిందకి కుదించుకుపోయింది.

ఎనిమిది గ్రామాల ప్రజల అగచాట్లు

దీంతో దిబ్బపాలెం, సురవరం, భైలపూడి, జైతవరం, తునివలస తదితర పంచాయతీల్లోని ఎనిమిది గ్రామాల ప్రేజలు, వాహన చోదకులు తీవ్రమైన ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వర్షాల సమయంలో నరకయాతన అనుభవిస్తున్నారు. రాత్రి సమయాల్లో ప్రయాణాలు చేస్తే పలు ప్రమాదాలకు గురవుతున్నారు. ఈ విషయమై వారం రోజుల క్రితం దిబ్బపాలెం గ్రామంలో జరిగిన ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమంలో మాడుగుల ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి దృష్టికి ఎంపీటీసీ దారపు పెద్దినాయుడు, టీడీపీ జిల్లా నాయకుడు గౌరీపట్టపు నానాజీ తీసుకువెళ్లారు. అలాగే పలుమార్లు ఆయా గ్రామాల ప్రజలు సమస్యను అధికారులకు తెలిపారు. ఇప్పటికైనా అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి ఈ రహదారిని బాగుచేసి ప్రమాదాలను నివారించాలని ఆయా గ్రామాల ప్రజలు, వాహన చోదకులు వేడుకుంటున్నారు.



తారు రోడ్డులో ఊడిపోయిన పెచ్చులు.. గతుకులు



రహదారిలో కుంగిపోయిన కాజ్‌వే, మరోవైపు పెద్ద గతుకు

ప్రతీ రోజు నరకయాతన అనుభవిస్తున్నాం



-గౌరీపట్నపు నానాజీ, దిబ్బపాలెం, చీడికాడ మండలం

దిబ్బపాలెం-దండిసురవరం ఆర్‌అండ్‌బీ రోడ్డు శిథిలం కావడంతో ప్రయాణానికి నరకయాతన అనుభవిస్తున్నాం. వర్షాల సమయంలో గోతుల్లో నీరు నిల్వ ఉండిపోవడం వల్ల వాహన చోదకులు ప్రమాదాలకు గురవుతున్నారు. గర్భిణులు, రోగులు పడరాని పాట్లు పడుతున్నారు. అధికారులు స్పందించి ఈ రోడ్డును బాగుచేయాలి.

గత ప్రభుత్వం వైఫల్యంలోనే ఈ దుస్థితి



-దారపు పెద్దినాయుడు, ఎంపీటీసీ సభ్యుడు, దిబ్బపాలెం

గత ప్రభుత్వం వైఫల్యం కారణంగా దిబ్బపాలెం-దండిసురవరం రోడ్డుకు ఈ దుస్థితి ఏర్పడింది. ఈ రహదారి గోతులు పూడ్చడానికి, మరమ్మతులు చేయడానికి నిధులు మంజూరు చేయాలని ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి దృష్టికి తీసుకువెళ్లాం.

ప్రతీ గ్రామానికి రోడ్డు.. ఇంటింటికీ తాగునీరు కల్పిస్తాం

» అనకాపల్లి ఎంపీ సీఎం.రమేష్

రావికమతం, అక్టోబరు 15 (ఆంధ్యజ్యోతి): ప్రతీ గ్రామానికి రహదారితో పాటు ఇంటింటికీ కుళాయిల ద్వారా స్వచ్ఛమైన తాగునీరు అందిస్తామని అనకాపల్లి ఎంపీ సీఎం.రమేష్ అన్నారు. చీమలపాడు పంచాయతీ శివారు రాయిపాడు-పెదగరువు గ్రామాలకు రూ.50 లక్షలతో నిర్మించిన రోడ్డును, జడ్.కొత్తపట్నంలో నిర్మించనున్న సిమెంటు రోడ్డు పనులను ఎమ్మెల్యే కేఎస్ఎన్ఎస్ రాజుతో కలిసి మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రావికమతం మండలంలో మొదటి విడతగా రోడ్లు, డ్రైనేజీలు, అంగన్‌వాడీ, పాఠశాలలకు ప్రహరీ గోడల నిర్మాణాలు, తాగునీటి కల్పనకు రూ.8.3 కోట్లు మంజూరు చేసినట్టు చెప్పారు. ఈ పనులు పూర్తయిన వెంటనే మలివిడతో సాగునీటి వనరుల అభివృద్ధిపై దృష్టి పెడతామన్నారు. ప్రజల ఆకాంక్షను కూటమి ప్రభుత్వం శతశాతం నెరవేర్చుతుందని చెప్పారు. అనంతరం పంచాయతీ ప్రజలు తెలిపిన సమస్యల పరిష్కార బాధ్యత తనదేనని ఎంపీ హామీ ఇచ్చారు.



రాయిపాడు-పెదగరువుకు రోడ్డును ప్రారంభిస్తున్న ఎంపీ రమేష్, ఎమ్మెల్యే రాజు

ఇక నుంచి పల్లెకు అభివృద్ధి పండగ: ఎమ్మెల్యే

ఇకపై ప్రతీ పల్లెకు అభివృద్ధి పండగేనని ఎమ్మెల్యే కేఎస్ఎన్ఎస్ రాజు అన్నారు. దొండపూడి, మత్స్యవానిపాలెం, జడ్.బెన్నవరం, టి.అర్జాపురం, పి.పొన్నవోలు, గర్నికం, రావికమతం, గుడివాడ, మరుపాక, గుడ్డిప, గొంప, తట్టబంద, తోటకూరపాలెం, కన్నంపేట గ్రామాల్లో పలు అభివృద్ధి పనులను మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల అభివృద్ధే కూటమి ప్రభుత్వం లక్ష్యమని, ఈ అవకాశాన్ని పార్టీలకతీతంగా ఆయా గ్రామాల ప్రజలు వినియోగించుకోవాలని సూచించారు. అభివృద్ధి చేసిన నాయకుడు ప్రజలకు ఎప్పుడూ గుర్తుంటాడని చెప్పారు. అనంతరం రావికమతం పంచాయతీకి మంజూరైన చెత్త తరలింపు ట్రాక్టర్‌ను ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ కార్యక్రమాల్లో తహసీల్దార్ బి.వెంకటరమణ, పీఆర్ డీఈ ప్రసాద్, రాష్ట్ర హౌసింగ్ బోర్డు ఛైర్మన్ బత్తుల తాతయ్యబాబు, టీడీపీ నియోజవర్గ మహిళా అధ్యక్షురాలు కోట నీలవేణి, టీడీపీ మండల అధ్యక్షుడు రాజాన కొండనాయుడు, అర్జాపురం సర్పంచ్ ఎం.ఫాల్గుణ, ఎంపిటీసీ సభ్యులు జి.సూర్యనారాయణ, వేపాడ లక్ష్మి, కూటమి నాయకులు బంటు శ్రీను, తాతాజీ, చిన్నబ్బాయి, గంజి మోదు నాయుడు, ఉప్పులూరి నాగేశ్వరావు, గంజి శ్రీను, సూరిబాబు పాల్గొన్నారు.

గ్రామాల్లో పల్లె పండగ



తాటిపర్తి గ్రామ సచివాలయ భవనాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే బండారు

మాడుగుల రూరల్: మండలంలోని కేజే పురం, తాటిపర్తి, శంకరం గ్రామాల్లో మంగళవారం పల్లె పండగ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి పాల్గొని శంకరం, తాటిపర్తి గ్రామాల్లో నూతనంగా నిర్మించిన గ్రామ సచివాలయ భవనాలను ప్రారంభించారు. కేజే పురంలో శ్మశానవాటిక ప్రహరీ గోడ నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. అలాగే ఎన్‌ఆర్‌ఈజీఎస్ ద్వారా పలు అభివృద్ధి పనులను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యులు శ్రీనివాసు, లోవ చిన్నతల్లి, టీడీపీ మండల అధ్యక్షుడు అద్దిపల్లి జగ్గారావు, ప్రధాన కార్యదర్శి ఉండూరు దేముడు, మాజీ ఎంపీపీ పుప్పాల అప్పలరాజు పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధికి సమన్వయంతో పనిచేయాలి

» మండల సర్వసభ్య సమావేశంలో ఎంపీపీ రాజేశ్వరి



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ రాజేశ్వరి

నర్సీపట్నం అర్బన్, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): మండలంలో గ్రామాల అభివృద్ధికి అధికారులు, ప్రజా ప్రతినిధులు సమన్వయంతో పనిచేయాలని ఎంపీపీ ఎస్.రాజేశ్వరి సూచించారు. మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో మంగళవారం జరిగిన సర్వసభ్య సమావేశంలో ఆమె మాట్లాడారు. అభివృద్ధి కోసం అంతా కలిసికట్టుగా పనిచేద్దామని కోరారు. జడ్పీటీసీ సభ్యురాలు సుకల రమణమ్మ మాట్లాడుతూ మండలంలో అభివృద్ధి పనులకు స్పీకర్ అయ్యన్న రూ.1.65 కోట్లు మంజూరు చేశారన్నారు. మరో రూ.4 కోట్లతో పలు అభివృద్ధి పనులకు ప్రతిపాదనలు సిద్ధం చేశారన్నారు.

వ్యవసాయ శాఖ అధికారి అప్పారావు తమశాఖ పనితీరును సభ్యులకు వివరిస్తుండగా, ఎంపీపీ రాజేశ్వరి స్పందిస్తూ రైతు భరోసా నిధుల సంగతి ఏమిటని ప్రశ్నించారు. వేములపూడి ఎంపీటీసీ సభ్యుడు బోళం రాంప్రసాద్ కలుగుజేసుకుని అంగన్‌వాడీ భవనాల నిర్మాణానికి స్థలం కేటాయించాలని, రైతులకు అవసరమైన పొటాష్ అందుబాటులో ఉండే విధంగా రైతులు చర్యలు చేపట్టాలని కోరారు. 90 శాతం రాయితీతో డ్రిప్ పైపులు అందిస్తున్నట్టు ఉద్యానవశాఖాధికారి తెలిపారు. ఓఎల్.పురం, గబ్బాడ గ్రామాల్లో రేషన్ సరుకులు తీసుకోవటానికి రావాలని, ఆయా గ్రామాల్లో రేషన్ అందించే వాహనలదారులు పలు ఇబ్బందులు పెడుతున్నారంటూ జడ్పీటీసీ సభ్యురాలు రమణమ్మ దృష్టికి గబ్బాడ సర్పంచ్ రాజేశ్వరి తీసుకువచ్చారు. దీనిపై పరిశీలించి చర్యలు చేపడతామని డీటీ నరేంద్రబాబు చెప్పారు. త్వరలో పలు అభివృద్ధి పనులు చేపట్టనున్నట్టు ఆర్‌అండ్‌బీ శాఖాధికారులు తెలిపారు. వివిధ శాఖల పనితీరును ఆయా శాఖల అధికారులు వివరించారు. ఈ సమావేశంలో ఎంపీడీవో ఉషశ్రీ, ఏవో బీహెచ్‌వీ.రమణబాబు, వైస్ ఎంపీపీ తాతబాబు, పలువురు ఎంపీటీసీ సభ్యులు, సర్పంచులు పాల్గొన్నారు.

'కూటమి ప్రభుత్వంతోనే గ్రామాల అభివృద్ధి'



రామన్నపాలెంలో అభివృద్ధి పనులకు శంకుస్థాపన

మాకవరపాలెం, అక్టోబరు 15: కూటమి ప్రభుత్వంతోనే గ్రామాల అభివృద్ధి సాధ్యమని టీడీపీ మండల అధ్యక్షుడు ఆర్‌వై.పాత్రుడు అన్నారు. పల్లె పండగ సందర్భంగా భీమబోయినపాలెం, రామన్నపాలెం, శెట్టిపాలెం, జెడ్.గగంవరం గ్రామాల్లో మంగళవారం అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో ఎంపీడీవో సీతమహాలక్ష్మి, ఏపీవో వరలక్ష్మి, భీమబోయినపాలెం సర్పంచ్ రుత్తల నందకిశోర్, జెడ్.గంగవరం సర్పంచ్ దుంగల రమణ, పీఏసీఎస్ మాజీ అధ్యక్షుడు ఎ.రామునాయుడు పాల్గొన్నారు.

గొలుగొండలో...

గొలుగొండ: మండలంలో పాకలపాడు, రావణాపల్లి, జోగంపేట, సాలికమల్లవరం, పొగచెట్లపాలెం గ్రామాల్లో రోడ్ల నిర్మాణానికి మంగళవారం కూటమి నాయకులు శంకుస్థాపన చేశారు. మట్టి రోడ్లను సిమెంట్ రోడ్లగా అభివృద్ధి చేయడానికి ప్రభుత్వం రూ.10 లక్షల చొప్పున మంజూరు చేసినట్టు నాయకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు సుర్ల బాబ్జి, కొల్లి సత్యనారాయణ, కొల్లి రాంబాబాబు, కర్రి నాయుడు, కామిరెడ్డి రామన్న, కసిమి బాబూరావు, గెడ్డం ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

నాతవరంలో...

నాతవరం: మండలంలోని గన్నవరం గ్రామంలో సీసీ రోడ్ల నిర్మాణానికి మంగళవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా జడ్పీటీసీ మాజీ సభ్యుడు కరక సత్యనారాయణ మాట్లాడుతూ స్పీకర్ అయ్యన్నపాత్రుడు వివిధ అభివృద్ధి పనులకు రూ.13 కోట్లు మంజూరు చేశారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీవో చిన్నారావు, టీడీపీ మండల అధ్యక్షుడు ఎన్.వెంకటరమణ, తాండవ ప్రాజెక్టు కమిటీ మాజీ ఛైర్మన్ పారుపల్లి కొండబాబు, నాయకులు విజయ్‌కుమార్, ఎస్.సన్యాసిదేముడు, కె.మరిడియ్య, బంగారు సూరిబాబు, అడిగర్ల భాస్కరరావు పాల్గొన్నారు.

పరిపాలనలో భాగస్వాములు కావాలి

గొలుగొండ, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): గ్రామ పరిపాలనలో వార్డు సభ్యులు భాగస్వాములు కావాలని ఎంపీపీ మణికుమారి సూచించారు. మండల పరిషత్ సమావేశ మందిరంలో మంగళవారం వార్డు సభ్యులకు శిక్షణ తరగతులు ప్రారంభించారు. పంచాయతీల్లో వార్డు మెంబర్ల పాత్రను వివరించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ ప్రభుత్వం అందిస్తున్న శిక్షణ ద్వారా వార్డు సభ్యులు అవగాహన చేసుకుని గ్రామాల్లో అభివృద్ధికి తోడ్పడాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జి ఎంపీడీవో సత్యనారాయణ, ఇన్‌చార్జి ఈవోపీఆర్‌డీ అప్పారావు, వివిధ గ్రామ పంచాయతీల వార్డు సభ్యులు పాల్గొన్నారు.

గబ్బాడలో పొలం పిలుస్తోంది...



కార్యక్రమంలో మాట్లాడుతున్న ఏడీఏ శ్రీదేవి

నర్సీపట్నం రూరల్, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): గబ్బాడ గ్రామంలో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఏడీఏ శ్రీదేవి మాట్లాడుతూ చిరు పొట్ట దశలో ఉన్న వరి పంటకు ఎకరానికి 20 కిలోల యూరియా, 15 నుంచి 20 కిలోల ఎంఓపీ వేసుకోవాలని సూచించారు. ఉద్యాన శాఖ జిల్లా అధికారి ప్రభాకరరావు మాట్లాడుతూ జీడిమామిడి పంట యాజమాన్య పద్ధతులు, ఆయిల్ పామ్ రైతులకు అందిస్తున్న రాయితీలను వివరించారు.

గొలుగొండ: మండలంలోని చీడిగుమ్మల, పోలవరం గ్రామాల్లో మంగళవారం వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మండల వ్యవసాయాధికారి సుధారాణి మాట్లాడుతూ రైతులు ప్రకృతి వ్యవసాయ సాగుపై రైతులు అవగాహన చేసుకోవాలన్నారు. చీడపీడల నివారణకు మందుల పిచికారీ చేయాలంటే వ్యవసాయాధికారుల సలహాలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ శాఖ సిబ్బంది, రైతులు తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో సామూహిక కుంకమార్చనలు

బుచ్చెయ్యపేట, అక్టోబరు 15: చినప్పన్నపాలెం గ్రామంలో పైడిమాంబ అమ్మవారి నూతన ఆలయ, విగ్రహ ప్రతిష్ఠ, ద్వారపాలక శిలా మూర్తుల ప్రతిష్ఠమహోత్సవంలో భాగంగా మంగళవారం సామూహిక కుంకుమార్చనలు నిర్వహించారు. అలాగే మహన్యాస పూర్వక రుద్రాభిషేకాలు, విశేష హోమాలను భక్తులు భక్తిశ్రద్ధలతో చేశారు. వేద పండితులు బైరి సీతారామమూర్తి శర్మ సారథ్యంలో మండపాలకు పూజలు, క్షీరాధి వాసము, ధాన్యాధివాసములను శాస్త్రోయుక్తంగా నిర్వహించారు.

మండల సర్వ సభ్య సమావేశం రేపు

రోలుగుంట, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): మండల పరిషత్ కార్యాలయంలో ఈ నెల 17వ తేదీ సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్టు ఎంపీడీవో నాగేశ్వరరావు తెలిపారు. 24 పంచాయతీల ఎంపీటీసీ సభ్యులు, సర్పంచులు, అన్ని శాఖల అధికారులు తప్పనిసరిగా హాజరుకావాలని ఆయన సూచించారు.

పరిపాలన విధానంపై అవగాహన అవసరం

కె.కోటపాడు, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): గ్రామ పంచాయతీల పరిపాలన విధానంపై సర్పంచులు, వార్డు సభ్యులు అవగాహన కలిగి ఉండాలని ఎంపీడీవో సాంబశివరావు సూచించారు. మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో మంగళవారం గ్రామ పంచాయతీల్లో సాధారణ పరిపాలనా విధానం, ఏపీపీఆర్ చట్టం 1994 నిబంధనలు తదితర పది అంశాలపై సర్పంచులు, ఉప సర్పంచులు, వార్డు సభ్యులకు రెండు రోజుల శిక్షణ కార్యక్రమాన్ని మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామ పాలనలో సర్పంచులు, ఉప సర్పంచులు, వార్డు సభ్యులు భాగస్వాములు కావాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సూపరింటెండెంట్ అప్పలరాజు, ఈవోపీఆర్డీ రమణ పాల్గొన్నారు.

ప్రత్యేక అభ్యసనతో సమస్యలకు పరిష్కారం

రావికమతం, అక్టోబరు 15 (ఆంధ్యజ్యోతి): ప్రత్యేక అభ్యసనతో దివ్యాంగ పిల్లలకు సమస్యలకు పరిష్కారం లభిస్తుందని మండల విద్యాశాఖ అధికారి బ్రహ్మాజీ అన్నారు. డిస్‌లెక్సియా మాసోత్సవం సందర్భంగా మంగళవారం నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడుతూ దివ్యాంగ విద్యార్థులకు అవసరమైన అన్నిరకాల సేవలను, సదుపాయాలను ప్రభుత్వం కల్పిస్తుందన్నారు. వాటిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. పత్యేక ఉపాధ్యాయుడు మహాలక్ష్మినాయుడు మాట్లాడుతూ దివ్యాంగ చట్టం 2016 ప్రకారం 21 రకాల వైకల్యాల్లో నిర్దిష్ట అభ్యసన వైకల్యం ఒక్కటన్నారు. అనంతరం డిస్ లెక్సియాపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు నాగేశ్వరావు, నాగమణిశాంతి, జగన్నాథనాయుడు పాల్గొన్నారు.

దేవరాపల్లిలో జిల్లా స్థాయి క్రీడా పోటీలు

దేవరాపల్లి, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఉమ్మడి జిల్లా స్థాయిలో అండర్-14 ఫుట్‌బాల్ పోటీలు నిర్వహిస్తున్నట్టు ఎంఈవో పడాల్‌దాసు తెలిపారు. అలాగే బుధవారం ఉదయం ఎనిమిది గంటలకు జిల్లా స్థాయి పోటీలకు ఎంపికలు జరుగుతాయని ఆయన చెప్పారు.

'సుజల స్రవంతిపై పాలకులకు సవతి ప్రేమ'

కె.కోటపాడు, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): ఉత్తరాంధ్ర సుజల స్రవంతి ప్రాజెక్టుపై పాలకులు చిన్న చూపు చూస్తున్నారని ఆంధ్రప్రదేశ్ చెరకు రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు వేచలపు కాసుబాబు ఆరోపించారు. కె.కోటపాడు సీపీఐ కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఏ ప్రభుత్వం వచ్చినా అభివృద్ధి చెందిన ప్రాంతాలపై ప్రేమ చూపుతూ, వెనుకబడిన ఉత్తరాంధ్రపై చిన్న చూపు చూస్తుందన్నారు. ఉత్తరాంధ్ర ప్రాజెక్టుల నిర్మాణానికి బడ్జెట్లో నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు. ఈ అంశంపై 22వ తేదీన అనకాపల్లి రోటరీ హాలులో జరిగే సదస్సును విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో రైతు సంఘం నాయకులు రెడ్డి అప్పలనాయుడు, గొర్లె దేముడుబాబు, వర్రి సన్యాసినాయుడు, ఎస్.రామునాయుడు, సూర్యనారాయణ పాల్గొన్నారు.



గంటలకు గంటలు ఫోన్‌లోనే...!

కొంతమంది పది గంటలకు పైగా.... మరికొంతమంది ఐదారు గంటలు...

సామాజిక మాధ్యమాలకు ఎక్కువ సమయం వినియోగిస్తున్న యువత



ఇన్‌స్టాగ్రామ్, ఫేస్‌బుక్ వంటి సైట్స్‌లో కనీసం రెండు నుంచి మూడు గంటలు



- మధ్య వయస్కుల్లో ఎక్కువ మంది యూట్యూబ్‌తో కాలక్షేపం
- మీ ఫోన్ స్ర్కీన్ టైమ్ ఎంతో తెలుసా..!
- రోజుకు ఎన్ని గంటలు ఫోన్ వినియోగిస్తున్నారో ఎప్పుడైనా చెక్ చేశారా..?
- అతి వినియోగంతో అనారోగ్య సమస్యలు

(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

ప్రస్తుతం స్మార్ట్ ఫోన్‌తో ఎక్కువ సమయాన్ని గడుపుతున్న వారి సంఖ్య పెరిగింది. ఉద్యోగ, వ్యాపారరీత్యా ఫోన్ వాడాల్సిన అవసరం ఏర్పడింది. అయితే, చాలామంది ఎంటర్‌టైన్‌మెంట్ కోసం గంటల తరబడి ఫోన్ వినియోగిస్తున్నారు. తాము ఎంత సమయం ఫోన్‌కు వినియోగించామన్న విషయం మాత్రం పట్టించుకోవడం లేదు. 2018లో గూగుల్ స్ర్కీన్ టైమ్ తెలుసుకునే వెసులుబాటును ఆండ్రాయిడ్ ఫోన్ వినియోగదారులకు అందుబాటులోకి తీసుకువచ్చింది. ప్రతిరోజూ ఎంత సమయాన్ని ఫోన్‌కు కేటాయించామనే విషయాన్ని దాని ద్వారా తెలుసుకోవచ్చు. తద్వారా ఫోన్‌కు వెచ్చించే సమయాన్ని తగ్గించుకునేలా ఎవరికి వారు జాగ్రత్తపడవచ్చు.

మూడింటికే 90 శాతం సమయం

స్ర్కీన్ టైమ్ గురించి చాలామంది స్మార్ట్ ఫోన్ వినియోగదారులకు తెలియదు. నగర పరిధిలో వివిధ కేటగిరీలకు చెందిన పలువురి స్ర్కీన్ టైమ్ తెలుసుకునే ప్రయత్నం 'ఆంధ్రజ్యోతి' ప్రతినిధి చేయగా ఆసక్తికరమైన విషయాలు వెల్లడయ్యాయి. 18 ఏళ్లలోపు వయసున్న ఐదుగురి ఫోన్‌లో స్ర్కీన్ టైమ్ చూడగా సగటున తొమ్మిది గంటలు ఉంది. ఇందులో 90 శాతం సమయాన్ని ఇన్‌స్టాగ్రామ్, ఫేస్‌బుక్, ట్విట్టర్ వంటి సామాజిక మాధ్యమాలకు కేటాయించినట్టు తేలింది. ఈ నెల పదో తేదీన ఇంటర్ రెండో ఏడాది చదువుతున్న దీపక్ స్ర్కీన్ టైమ్ చూడగా 10 గంటలు 22 నిమిషాలు ఉంది. అందులో నాలుగున్నర గంటలపాటు ఇన్‌స్టాగ్రామ్, మూడు గంటలు యూట్యూబ్‌కు, మరో గంటన్నర వాట్సాప్‌కు, మిగిలిన సమయాన్ని ఇతర యాప్స్‌కు వినియోగించినట్టు తేలింది. ఒక ప్రైవేటు సంస్థలో పనిచేస్తున్న 24 ఏళ్ల దీప్తి ఫోన్ స్ర్కీన్ టైమ్ ఏడు గంటలు ఉంది. ఇందులో దాదాపు మూడు గంటలు యూట్యూబ్ వీక్షించేందుకు వెచ్చించగా, ఇన్‌స్టాగ్రామ్‌కు 45 నిమిషాలు, వాట్సాప్‌కు గంటన్నర సమయాన్ని వెచ్చించినట్టు వెల్లడైంది. మరో గంట ఫోన్ కాల్స్ ఆరోగ్యశాఖలో పనిచేస్తున్న ఒక ఉద్యోగి స్ర్కీన్ టైమ్ పరిశీలించగా..ఐదున్నర గంటలు ఉంది. ఇందులో ఫోన్ కాల్స్‌కు సంబంధించి రెండున్నర గంటలు సమయం ఉండగా, వాట్సాప్‌కు మరో రెండు గంటలు వినియోగించినట్టు ఉంది. ఇతర యాప్స్‌కు మిగిలిన సమయాన్ని వినియోగించినట్టు వెల్లడైంది.

పద్దెనిమిదేళ్ల పైబడిన వారిలో మూడొంతులు మంది ఫోన్‌లో ఎక్కువ సమయం యూట్యూబ్ చూస్తున్నట్టు వెల్లడైంది. మహిళలు రోజువారీ స్ర్కీన్ టైమ్ ఆరు గంటలు ఉంటే అందులో కనీసం రెండు నుంచి మూడు గంటలు యూట్యూబ్‌కు వినియోగిస్తుండగా, మిగిలిన సమయాన్ని ఫోన్లు, ఇతర యాప్‌లకు వినియోగిస్తున్నట్టు తేలింది. రాజారావు అనే మెకానిక్ ఫోన్‌లో స్ర్కీన్ టైమ్ ఆరున్నర గంటలు ఉంది. ఇందులో మూడు గంటలు యూట్యూబ్‌కు, మరో గంటన్నర సమయాన్ని ఇన్‌స్టాగ్రామ్, 40 నిమిషాలు ఫేస్‌బుక్ కోసం వినియోగించినట్టు తేలింది. మిగిలిన సమయంలో గంట కాల్స్‌కు వినియోగించాడు.

ఇబ్బందులు తప్పవు..

గంటల తరబడి ఫోన్ వినియోగించడం వల్ల అనేక రకాల ఇబ్బందులు ఎదురవుతాయని వైద్యులు చెబుతున్నారు. డిజిటల్ స్ర్కీన్‌ను అదే పనిగా చూడడం వల్ల కళ్లు పొడిబారడం, అస్పష్టమైన దృష్టి, తలనొప్పి, తీవ్రమైన అలసట, తలబరువుగా అనిపించడం వంటి సమస్యలు తలెత్తుతాయి. అతిగా ఫోన్ వినియోగించడం, పడుకునే ముందు వరకు ఫోన్ చూడడం వల్ల నిద్రలేమి సమస్యతో బాధపడే ప్రమాదం ఉంది. మొబైల్ స్ర్కీన్ నుంచి వచ్చే బ్లూలైట్ మెలటోనిన్ ఉత్పత్తికి ఆటంకం కలిగిస్తుందని, ఈ హార్మోన్ నిద్ర రావడంలో సహాయపడుతుందని నిపుణులు చెబుతున్నారు. అదేవిధంగా తల కాస్త వంచి ఫోన్ చూస్తూ ఉండడం వల్ల మెడ, వెన్ను నొప్పి వంటి ఇబ్బందులు వేధిస్తాయని నిపుణులు హెచ్చరిస్తున్నారు.

- ● స్ర్కీన్ టైమ్ గురించి మాట్లాడింది 15 మందితో
- ● వీరిలో 18 ఏళ్లలోపు వారు ఐదుగురు. వీరిలో ముగ్గురి రోజువారీ స్ర్కీన్ టైమ్ సగటున 9 గంటలు. ఇందులో మూడు నుంచి నాలుగు గంటలు ఇన్‌స్టాగ్రామ్, ఫేస్‌బుక్ కోసం, మరో రెండు గంటలు యూట్యూబ్, మరో గంట వాట్సాప్‌కు వినియోగిస్తున్నారు.
- ● 18 నుంచి 40 ఏళ్లలోపు వాళ్లు ఆరుగురు. వీరిలో ఇద్దరు మహిళలు, నలుగురు పురుషులు. మహిళలు సగటు ఫోన్ స్ర్కీన్ టైమ్ ఆరు గంటలు. ఇందులో యూట్యూబ్‌కు కనీసం రెండు, మూడు మూడు గంటలు, గంటపాటు వాట్సాప్, మిగిలిన సమయం ఫోన్, ఇతర యాప్స్‌కు వినియోగిస్తున్నారు. పురుషుల సగటు ఫోన్ స్ర్కీన్ టైమ్ ఎనిమిది గంటలు. వీరిలో ముగ్గురు విద్యార్థులు కాగా, ఒక యువకుడు సాఫ్ట్‌వేర్ ఉద్యోగి. సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేస్తున్న యువకుడు ప్రతిరోజూ కనీసం పది గంటలు ఫోన్ వినియోగిస్తున్నాడు. ఉద్యో గపరమైన కార్యకలాపాలు కోసం రెండు గంటలు ఫోన్ యూజ్ చేస్తుండగా, మిగిలిన సమ యంలో రెండు గంటలు యూట్యూబ్, మరో గంటన్నర సమయం ఇన్‌స్టాగ్రామ్‌కు వెచ్చిస్తు న్నారు. మిగిలిన ముగ్గురు విద్యార్థుల్లో ఇద్దరు కనీసం ఐదు నుంచి ఏడు గంటలు ఫోన్ చూస్తున్నారు.
- ● 40 ఏళ్లు పైబడిన నలుగురి సగటు స్ర్కీన్ టైమ్ ఐదు గంటలుగా ఉంది. ఇందులో ప్రైవేటు ఉద్యోగం చేసుకునే రామ్ రోజువారీ స్ర్కీన్ టైమ్ ఐదు గంటలు. ఇందులో గంట యూట్యూబ్ కోసం వెచ్చిస్తుండగా, మరో గంట సామాజిక మాధ్యమాల్లోని అకౌంట్లు వీక్షించేందుకు, మరో గంటన్నర ఫోన్, మిగిలిన సమయాన్ని ఇతర యాప్స్ కోసం వెచ్చిస్తున్నారు. మిగిలిన ముగ్గురి స్ర్కీన్ టైమ్‌లో కనీసం రెండు గంటలు యూట్యూబ్ కోసం వెచ్చిస్తుండగా, మరో గంట వాట్సాప్, మరో గంటన్నర ఫోన్లకు వినియోగిస్తున్నారు. మిగిలిన సమయాన్ని ఇతర యాప్స్ వినియోగానికి వెచ్చిస్తున్నారు.

ఇలా తెలుసుకోవచ్చు...

ప్రతి రోజు ఫోన్‌ను ఎంత సమయం వినియోగించామనే విషయాన్ని ప్రతి ఒక్కరూ తెలుసుకోవచ్చు. స్మార్ట్ ఫోన్ వినియోగదారులు తమ ఫోన్ సెట్టింగ్స్‌లోకి వెళితే...అందులో డిజిటల్ వెల్‌బీయింగ్ అండ్ పేరెంటల్ కంట్రోల్స్ అని, కొన్ని ఫోన్లలో డిజిటల్ వెల్‌బీయింగ్ అనే ఆప్షన్ ఉంటుంది. ఈ ఆప్షన్ క్లిక్ చేస్తే ఓపెన్ చేసిన రోజు



ఎంత సమయం ఫోన్‌కు వినియోగించాం, అందులో ఏయే యాప్స్‌కు ఎంత సమయం కేటాయించామన్నది కనిపిస్తుంది. వ్యూ యాక్టివిటీ డిటెయిల్స్ ఆప్షన్‌ను క్లిక్ చేయడం ద్వారా మరింత సమాచారాన్ని పొందవచ్చు. నాలుగు వారాల ముందు సమాచారం కూడా వస్తుంది. రోజువారీ ఈ సమాచారాన్ని చూసుకోవడం ద్వారా దేనికి ఎక్కువ సమయాన్ని కేటాయిస్తున్నారో తెలుసుకోవచ్చు. అవసరం లేని వాటికి సమయాన్ని తగ్గించుకునేందుకు ఇది దోహదం పడుతుందని నిపుణులు చెబుతున్నారు.

క్రైం... crime news

స్తంభాన్ని బైక్ ఢీకొని విద్యార్థి మృతి

- మరొకరికి తీవ్రగాయాలు



బొద్దపు హేమంత్ (ఫైల్‌ఫొటో)

పరవాడ, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): ద్విచక్ర వాహనం అదుపు తప్పి, రోడ్డు పక్కన వున్న స్తంభాన్ని ఢీకొన్న ప్రమాదంలో ఒక విద్యార్థి మృతిచెందాడు. మరొకరికి తీవ్రగాయాలయ్యాయి. ఈ సంఘటనకు సంబంధించి సీఐ మల్లికార్జునరావు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. మండలంలోని ఈ.బోనంగి పంచాయతీ బొద్ద ఫువానిపాలెం గ్రామానికి చెందిన బొద్దపు హేమంత్ (16), బొద్దపు డిసిధర్ స్నేహితులు. హేమంత్ ప్రైవేటు కళాశాలలో ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం చదువుతున్నాడు. తన పదో తరగతి మార్కుల మెమో కోసం డిసిధర్‌తో కలిసి బైక్‌పై మంగళవారం మధ్యాహ్నం లంకెలపాలెంలోని ఓ ప్రైవేటు పాఠశాలకు వెళ్లాడు. మార్కుల మెమోను తీసుకుని ఇంటికి తిరిగి వస్తుండగా రాంకీ ఫైర్‌స్టేషన్ రోడ్డు క్రాసింగ్ సమీపంలో అదుపుతప్పి రహదారి పక్కన ఉన్న స్తంభాన్ని బలంగా ఢీకొన్నారు. దీంతో తీవ్రగాయాలైన వీరిని అనకాపల్లిలో ఒక ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. హేమంత్ అప్పటికే మృతిచెందినట్టు వైద్యులు చెప్పారు. డిసిధర్ చికిత్స పొందుతున్నాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఎన్టీఆర్ వైద్యాలయం మార్చురీకి తరలించారు. సీఐ మల్లికార్జునరావు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ముత్యాలమ్మపాలెం తీరంలో మృతదేహం

పరవాడ, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ముత్యాలమ్మపాలెం సముద్ర తీరానికి మంగళవారం ఉదయం మృతదేహం కొట్టుకువచ్చింది. దీనిపై స్థానిక మత్స్యకారులు పరవాడ పోలీసులకు సమాచారమిచ్చారు. సీఐ జి.మల్లికార్జునరావు సంఘటన స్థలానికి వెళ్లి పరిశీలించారు. మృతదేహం బాగా కుళ్లిపోయి గుర్తు పట్టలేని విధంగా వుందని, శరీరంపై దుస్తులు లేవని, సుమారు 15 రోజుల క్రితం చనిపోయి ఉండొచ్చని సీఐ చెప్పారు. 20-30 ఏళ్ల వయసు వుంటుందని, కుడిచేతిపై ఫ్లైయింగ్ ఈగల్ బొమ్మ, 27, ఎస్‌డబ్ల్యూఎఫ్ అని పచ్చబొట్టుతో రాసి వుందని సీఐ తెలిపారు.

చికెన్ ధరలు

బ్యాగ్	రూ.లలో
రైతు ధర	120.00
లైవ్ ధర	149.00
విత్ స్కిన్	250.00
స్కిన్ లెస్	260.00

కోడి గుడ్లు (నెక్)

వంద గుడ్లు	రూ.లలో
విశాఖపట్నం	515
విజయనగరం	519
శ్రీకాకుళం	519

పారిశ్రామిక క్లస్టర్‌గా సబ్బవరం

- జిల్లాను అభివృద్ధి పథంలో నడిపిస్తా
- గ్రామాల్లో మినరల్ వాటర్ ప్లాంట్లు
- అనకాపల్లి ఎంపీ సీఎం రమేశ్



సభలో మాట్లాడుతున్న ఎంపీ సీఎం రమేశ్

సబ్బవరం, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): సబ్బవరం మండలాన్ని పారిశ్రామిక క్లస్టర్‌గా అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తానని, అనకాపల్లి జిల్లాను అన్ని రంగాల్లో అభివృద్ధి పథంలో నడిపిస్తానని ఎంపీ సీఎం రమేశ్ పేర్కొన్నారు. మండలంలోని గొటివాడలో మంగళవారం జరిగిన పల్లె పండుగ- పంచాయతీ వారోత్సవాల్లో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో ఎంపీ ప్రసంగిస్తూ.. 2014-19 మధ్య టీడీపీ ప్రభుత్వం 10 వేల నుంచి 12 వేల కోట్ల రూపాయలు ఖర్చు చేసి 30 వేల కిలోమీటర్ల మేర సీసీ రోడ్లు వేసిందని, తరువాత అధికారంలోకి వచ్చిన వైసీపీ ప్రభుత్వం కేంద్రం ఇచ్చిన నిధులను పక్కదారి పట్టించిందని ఆరోపించారు. ప్రజాధనంతో నిర్మించిన ప్రభుత్వం భవనాలకు వైసీపీ రంగులు, జగన్ బొమ్మలు వేసుకున్నారని, కోర్టులు మొట్టికాయలు వేస్తే.. ఆ రంగులు తొలగించడానికి కోట్లాది రూపాయలు వృథా చేశారని విమర్శించారు.

రానున్న ఐదేళ్లలో రూ.50 వేల కోట్లతో గ్రామాల్లో మౌలిక వసతులు కల్పించేందుకు సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ కృషి చేస్తున్నారన్నారు. కలుషిత తాగునీటి కారణంగా పలు రకాల వ్యాధులబారిన పడుతున్నారని, ఈ సమస్యను తొలగించేందుకు ఎంపీ నిధులతో మినరల్ వాటర్ ప్లాంట్లు ఏర్పాటు చేయిస్తానన్నారు. ఎమ్మెల్యే పంచకర్ల రమేశ్‌బాబు మాట్లాడుతూ, సీఎం చంద్రబాబు పరి పాలన అనుభవం, విజన్ రాష్ట్రాభివృద్ధికి ఎంతో అవసరమని అన్నారు. దీపావళి నుంచి ఉచిత గ్యాస్ సిలిండర్లు, మహిళలకు ఉచిత బస్సు బసు ప్రయాణం హామీలు అమలుచేస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో టీడీపీ పెందుర్తి ఇన్‌చార్జి గండి బాబ్జీ, వైస్‌ఎంపీపీ ఝాన్సీలక్ష్మీరాణి, స్థానిక సర్పంచ్ సాలాపు మీన, ఇతర పంచాయతీల సర్పంచులు దాడి లావణ్య, ఆకుల శ్రీహేమ, మామిడి శంకరరావు, ఎంపీటీసీ బొండా శేషు కుమారి, కూటమి నేతలు భరణికాన బాబూరావు, గొర్లి రామునాయుడు, కర్రి కనకరాజు, మహాలక్ష్మీ నాయుడు, ఇందలి వెంకటరమణ, బీప రావు, సాలాపు వెంకటేశ్వర రావు, దొడ్డి ప్రకాశ్, బోకం స్వామినాయుడు, చైతన్య, రొంగలి దేముడు, ఎంపీడీవో పద్మజ, తహసీల్దార్ బి.చిన్నికృష్ణ, పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

తేనెటీగల దాడిలో 15 మందికి గాయాలు

- బాధితులు ఉపాధి హామీ కూలీలు
- పనులు చేస్తుండగా ఘటన



సీహెచ్‌సీలో చికిత్స పొందుతున్న బాధితులు

ముంచంగిపుట్టు, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): మండలంలో గల సుజనకోట పంచాయతీ సుజనపేట గ్రామ సమీపంలో ఉపాధి హామీ పనులు చేస్తున్న కూలీలపై మంగళవారం తేనె టీగలు దాడి చేశాయి. ఈ సంఘటనలో 15 మందికి గాయాలయ్యాయి. దీనికి సంబంధించి వివరాలు ఇలా వున్నాయి. మంగళవారం గ్రామ శివారులో సుమారు 80 మంది కూలీలు ఉపాధి హామీ పనులు చేస్తున్నారు. ఆకస్మికంగా తేనెటీగలు కూలీలపై దాడి చేయడంతో వారు భయంతో పరుగులు తీశారు. వారిలో 15 మందికి గాయాలయ్యాయి. వీరిలో ఎనిమిది మంది తీవ్రంగా గాయపడ్డారు. వీరిని సర్పంచ్ వి.రమేశ్ 108 వాహనంలో స్థానిక సీహెచ్‌సీకి తరలించారు. డాక్టర్ సంతోశ్ బాధితులకు వైద్య సేవలు అందించారు. సాయంత్రం వరకు వైద్యుల పర్యవేక్షణలో వారిని ఉంచారు. సకాలంలో ఆస్పత్రికి తీసుకురావడంతో ప్రాణాపాయం తప్పిందని వైద్యులు తెలిపారు.

సీఎస్ఐఆర్ నెట్‌లో 'పేట విద్యార్థినికి 127వ ర్యాంకు



కొసిరెడ్డి లక్ష్మీప్రహర్ష

పాయకరావుపేట, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి) : ఈ ఏడాది జూలైలో నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్‌టీఏ) నిర్వహించిన సీఎస్ఐఆర్ నెట్‌లో పాయకరావుపేటకు చెందిన కొసిరెడ్డి లక్ష్మీప్రహర్ష అఖిల భారత స్థాయిలో 127వ ర్యాంకు సాధించింది. సెంట్రల్ యూనివర్సిటీలో ఫిజిక్స్‌లో పీజీ చేసిన ఈమె ప్రస్తుతం ఒక ప్రముఖ ప్రైవేటు విద్యా సంస్థలో ఫ్యాకల్టీగా పనిచేస్తున్నది. ఐఐటీ, ఎన్ఐటీ లేదా సెంట్రల్ యూనివర్సిటీలో రీసెర్చ్‌చేసి, ప్రొఫెసర్‌గా స్థిరపడాలన్నదే తన లక్ష్యమని లక్ష్మీప్రహర్ష తెలిపారు. ఈమె తండ్రి డాక్టర్ కొసిరెడ్డి వీర్రాజు ఆదిత్య డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్‌గా పనిచేస్తున్నారు. సీఎస్ఐఆర్ నెట్‌లో ఉత్తమ ర్యాంకు సాధించిన లక్ష్మీప్రహర్షను ఆదిత్య విద్యా సంస్థల చైర్మన్ డాక్టర్ ఎన్.శేషారెడ్డి, కార్యదర్శి డాక్టర్ సుగుణారెడ్డి, అకడమిక్ డైరెక్టర్ బీవీఈఎల్ నాయుడు తదితరులు అభినందించారు.

వృద్ధురాలి అదృశ్యంపై ఫిర్యాదు

అనకాపల్లి టౌన్, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి) : తుమ్మపాలకు చెందిన యర్రంశెట్టి నాగమణి (69) అదృశ్యమైనట్టు పోలీసులకు ఫిర్యాదు అందింది. ఈమె సోమవారం సాయంత్రం ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదని కుమారుడు యర్రంశెట్టి హరిశేఖర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పట్టణ ఎస్ఐ అల్లు వెంకటేశ్వర రావు తెలిపారు.

ఆరుగురికి అస్వస్థత

- వాంతులు, విరేచనాలతో ఆస్పత్రిలో చేరిక
- ఒకరి పరిస్థితి విషమం.. కేజీహెచ్‌కి తరలింపు



అరకులోయ ప్రాంతీయ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న మాడగడ గ్రామస్థులు

అరకులోయ, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మాడగడ గ్రామంలో వాంతులు, విరేచనాలతో ఆరుగురు అస్వస్థతకు గురయ్యారు. వీరంతా సోమవారం అరకులోయ ప్రాంతీయ ఆస్పత్రిలో చేరినట్టు ఆస్పత్రి సూపరింటెండెంట్ ఎల్.రాము తెలిపారు. కలుషిత ఆహారం, నీళ్ల వల్ల వీరు అస్వస్థతకు గురైనట్టు చెప్పారు. వీరిలో అగతంబుడి భవాని(27) పరిస్థితి విషమంగా ఉండడంతో మెరుగైన వైద్యం కోసం మంగళవారం విశాఖ కేజీహెచ్‌కు తరలించినట్టు ఆయన చెప్పారు. మిగిలిన వారి ఆరోగ్యం ప్రస్తుతం నిలకడగానే ఉందన్నారు. వీరితో పాటు మరో ఐదుగురు కూడా ఇదే లక్షణాలతో ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారని ఆయన చెప్పారు.

నివాసాలకు సూర్యఘర్ వెలుగులు

- రాయితీపై సోలార్ యూనిట్లు ఏర్పాటు
- జిల్లాలో ఐదు సోలార్ మోడల్ గ్రామాలు
- కలెక్టర్ విజయకృష్ణన్



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్

అనకాపల్లి, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): సంప్రదాయేతర ఇంధన వనరుల అభివృద్ధిలో భాగంగా కేంద్ర ప్రభుత్వం రాయితీపై అందిస్తున్న పీఎం సూర్యఘర్ పథకాన్ని వినియోగించుకుని నివాసాలకు సోలార్ విద్యుత్ యూనిట్లను ఏర్పాటు చేసుకోవాలని కలెక్టర్ విజయకృష్ణన్ తెలిపారు. మంగళవారం కలెక్టరేట్‌లో పీఎం సూర్యఘర్ పథకంపై నిర్వహించిన జిల్లాస్థాయి కమిటీ సమావేశంలో ఆమె మాట్లాడుతూ, సంప్రదాయేతర ఇంధన వనరుల ప్రోత్సాహక బహుమతికి ఐదు గ్రామాలు ఎంపికయ్యేలా జిల్లాలో గుర్తించిన గ్రామాలను సోలార్ మోడల్ విలేజ్‌లుగా తీర్చిదిద్దాలని తెలిపారు. ఈ పథకం గురించి ప్రజలకు అవగాహన కల్పించాలని చెప్పారు. సోలార్ యూనిట్ ఏర్పాటుతో ఉత్పత్తి అయిన విద్యుత్తును వాడుకోగా మిగిలిన విద్యుత్తును గ్రిడ్‌కు ఇవ్వడం ద్వారా ప్రజలకు ఆదాయం వస్తుందనే విషయాన్ని ప్రచారం చేయాలన్నారు. ఈపీడీసీఎల్ ఎస్ఈ ప్రసాద్.. పథకం వివరాలను వెల్లడించారు. జిల్లాలో 30వేల సోలార్ యూనిట్లను ఏర్పాటు చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నట్టు తెలిపారు. సమావేశంలో జడ్పీ సీఈవో పి.నారాయణమూర్తి, తదితరులు పాల్గొన్నారు.

కలెక్టరేట్‌లో కమాండ్ కంట్రోల్ రూమ్

అనకాపల్లి కలెక్టరేట్, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో రానున్న రెండు రోజుల్లో భారీ వర్షాలు కురుస్తాయన్న వాతావరణ శాఖ హెచ్చరికల నేపథ్యంలో కలెక్టరేట్‌లో కమాండ్ కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసినట్టు డీఆర్‌ఓ దయానిధి మంగళవారం రాత్రి ఒక ప్రకటనలో తెలిపారు. మండల అధికారులంతా అప్రమత్తంగా ఉండాలన్నారు. అత్యవసర సమయంలో కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన టోల్‌ఫ్రీ నంబరు 08924 222888కు కాల్ చేయవచ్చునన్నారు.

గబ్బాడ ఇసుకకు లైన్ క్లియర్

... 5వ పేజీ తరువాయి

చేయాలని ఆర్డీవో వీవీరమణకు సూచించారు. మునిసిపాలిటీలో పారిశుధ్యం, తాగునీరు, వీధిదీపాల సమస్యపై దృష్టి పెట్టాలని కమిషనర్ సురేంద్రను ఆదేశించారు. నర్సీపట్నం మునిసి పాలిటీని మొదటి స్థానంలో నిలపడమే తన లక్ష్యమని, అభివృద్ధికి అన్ని విధాలుగా సహకరిస్తానని అన్నారు. డంపింగ్ యార్డులో 100 టన్నులు చెత్తను విశాఖలోని జిందాల్ 'వేస్ట్ టు పవర్' ప్లాంట్‌కి తరలించామని, ఇంకా 200 టన్నుల వరకు తరలించాల్సి ఉందని కమిషనర్ తెలిపారు. నర్సీపట్నం నియోజకవర్గంలో రోడ్ల మరమ్మతులకు నిధులు కేటాయించామని, త్వరగతిన పనులు చేపట్టాలని ఆర్‌అండ్‌బీ అధికారులను ఆదేశించారు.

అనకాపల్లిలో భారీ వర్షం

... 5వ పేజీ తరువాయి

మీదుగా మళ్లించారు.

ఎలమంచిలిలో పిడుగుల వర్షం

ఎలమంచిలి, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి) 15: ఎలమంచిలి పట్టణంలో సోమవారం అర్ధరాత్రి ఉరుములు, పిడుగులతో భారీ వర్షం కురిసింది. దీంతో కొత్తపేట కాలనీలోని పలు ఇళ్లల్లో ఫ్యాన్లు, టీవీలు, లైట్లు వంటి ఎలక్ర్టికల్, ఎలక్ర్టానిక్స్ వస్తువులు కాలిపోయాయి. పిడుగుపాటుకు సుమారు గంటపాటు విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. రామ్‌నగర్ టిడ్కో గృహ సముదాయం సమీపంలో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ దెబ్బతినడంతో విద్యుత్ శాఖ సిబ్బంది అర్ధరాత్రి రంగంలోకి దిగి మరమ్మత్తు పనులు చేపట్టారు.

రోడ్డు విస్తరణపై 'మహా' నిర్లక్ష్యం

... 5వ పేజీ తరువాయి

రహదారిని విస్తరించాలని చాలా ఏళ్ల నుంచి స్థానికులు, వ్యాపారులు విజ్ఞప్తి చేస్తున్నారు. ఎట్టకేలకు జీవీఎంసీ అధికారులు గత ఏడాది జూన్‌లో రోడ్డును 50 అడుగులకు విస్తరించేందుకు చర్యలు చేపట్టారు. ఇరువైపులా డ్రైనేజీ కాలువలు, మధ్యలో డివైడర్ నిర్మాణంతోపాటు రోడ్డు అభివృద్ధికి రూ.2.8 కోట్లు మంజూరు చేశారు. టెండర్లు పిలిచి కాంట్రాక్టర్‌తో ఒప్పందం చేసుకున్నారు. రోడ్డు విస్తరణ కోసం ఇరువైపులా 139 మందికి చెందిన స్థలాలను సేకరించాల్సి వచ్చింది. సవరించిన మునిసిపల్ చట్టం ప్రకారం నష్టపరిహారం బదులు టీడీఆర్ సర్టిఫికెట్లు ఇస్తామని అధికారులు చెప్పగా, బాధితులు అంగీకరించారు. అయితే వీరిలో 58 మందికి మాత్రమే టీడీఆర్ సర్టిఫికెట్లు ఇచ్చారు. వీరికి సంబంధించిన స్థలాలను మునిసిపల్ అధికారులు స్వాధీనం చేసుకుని కాంట్రాక్టర్‌కు అప్పగించడంతో అంతవరకు డ్రైనేజీ కాలువల నిర్మాణ పనులు చేట్టారు. మిగిలిన వారికి టీడీఆర్‌లు ఇవ్వకపోవడంతో భూ సేకరణ జరగలేదు. పనులు సైతం ఆగిపోయాయి. మరోవైపు రహదారిపై భారీ గోతులు ఏర్పడి వర్షం కురిస్తే నీరు నిలిచిపోయి చెరువులను తలపిస్తున్నది. వాహనదారులు, పాదచారులు ఇబ్బంది పడుతున్నారు. రోడ్డు విస్తరణ పనులు ఆగిపోవడంపై టౌన్‌ప్లానింగ్ విభాగం అధికారులను 'ఆంధ్రజ్యోతి' వివరణ కోరగా.. రోడ్డు విస్తరణ కోసం స్థలాలు ఇచ్చిన వారిలో కొంతమందికి టీడీఆర్ సర్టిఫికెట్లు జారీ కాలేదని, త్వరలో వారికి టీడీఆర్‌లు ఇచ్చి రోడ్డు విస్తరణ పనులను కొనసాగిస్తామని చెప్పారు.